E-KABURU E-PAPER
# ఈ-కబురు
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
@ekaburu.com
(తేదీ) 24-08-2025 (వారం) ఆదివారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com



వాట్సాప్, ఈమెయిళ్లలో దూషించారన్న ఆరోపణలకు ఎస్సీ, ఎస్టీ చట్టం వర్తించదు » 3లో

భారత్ కీలక నిర్ణయం.. ఆ దేశానికి పోస్టల్ సేవలు బంద్ » 4లో




బౌలింగ్ కోసం ఆ మూడింటినీ బుమ్రా వదిలేశాడు: భరత్ అరుణ్ » 6లో



ఆ సీన్ కోసం 28 టేకులు.. ఆ విషయం ఎప్పుడు గుర్తొచ్చినా.. » 5లో



లార్డ్స్‌లో చెమటోడ్చిన విరాట్ కోహ్లీ »



# అంతరిక్షంలో సుదూర తీరాలను శోధిద్దాం

» మానవాళి భవిష్యత్తును మరింత ప్రకాశవంతం చేద్దాం

» అంతరిక్ష శాస్త్రవేత్తలకు ప్రధాని మోదీ పిలుపు



ఈ కబురు,దిల్లీ: మానవాళి భవిష్యత్తును మరింత ప్రకాశవంతం చేసేందుకు అంతరిక్షంలో సుదూర తీరాలను శోధించేందుకు సిద్ధం కావాలని శాస్త్రవేత్తలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. భవిష్యత్తులో చేపట్టనున్న అంతరిక్ష మిషన్ల కోసం పెద్ద ఎత్తున వ్యోమగాములను సిద్ధం చేస్తున్నామని, యువత ఇందులో భాగం కావాలని సూచించారు. జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా ఆయన శనివారం దేశవ్యాప్తంగా ఉన్న అంతరిక్ష శాస్త్రవేత్తలు, విద్యార్థులు, విధానకర్తలనుద్దేశించి వీడియో మాధ్యమంద్వారా ప్రసంగించారు.'

తరువాయి 2లో

# హైదరాబాద్ భవిష్యత్తు కోసం హైడ్రా



» సంస్థ ఏం చేస్తుందో కాలమే చెబుతుంది.. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకర పరిస్థితులు

» నాడు దూషించిన వారినుంచి నేడు జేజేలు

» దావూద్ ఇబ్రహీం తరహాలో బెదిరింపులు

» ఫాతిమా కాలేజీపైనా చర్యలు!!

» 'మీట్ ది ప్రెస్'లో హైడ్రా కమిషనర్ రంగనాథ్

తరువాయి 2లో



# రిజర్వేషన్లపై కాంగ్రెస్ సీనియర్ నేతలతో కమిటీ

» న్యాయకోవిదుల సలహాలు తీసుకుని 28లోగా నివేదిక...

» భట్టి విక్రమార్క, ఉత్తమ్ వెల్లడి

ఈ కబురు, హైదరాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు ఎలా ముందుకెళ్లాలనే అంశంపై న్యాయకోవిదుల సలహాలు తీసుకుని ఈ నెల 28లోగా నివేదిక ఇచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలతో కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. పీఏసీ సమావేశంలో చర్చించిన అంశాలను రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ఛైర్మన్ ఈరవత్రి అనిల్‌తో కలిసి వారు మీడియా సమావేశంలో వెల్లడించారు. భట్టి మాట్లాడుతూ... "బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు శాసనసభలో బిల్లులను ఆమోదించి గవర్నర్‌కు పంపితే ఆయన రాష్ట్రపతికి పంపారు. ఆ బిల్లుల ద్వారా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించి ఎన్నికలు జరపాలనుకున్నాం. బిల్లుల ఆమోదంలో ఆలస్యం అవుతుండటంతో హైకోర్టు ఆదేశాల ప్రకారం వచ్చే నెలాఖరులోగా స్థానిక సంస్థల ఎన్నికలకు ఎలా వెళ్లాలనే అంశంపై సమావేశంలో చర్చించాం.

తరువాయి 2లో

# పుతిన్ చర్యలతో సంతోషంగా లేను



» శాంతి చర్చలు విఫలమైతే ఆంక్షలు విధిస్తా

» రష్యాకు ట్రంప్ హెచ్చరిక

తరువాయి 2లో

# అమెరికాలో వలసదార్లు తగ్గుముఖం




» ఆరు నెలల్లోనే 15 లక్షలు తగ్గిన ఇమ్మిగ్రెంట్లు

» 5.33 కోట్ల నుంచి 5.19 కోట్లకు పడిపోయిన వలసదార్లు

» 'ప్యూ రీసెర్చ్ సెంటర్' నివేదికలో వెల్లడి

» అమెరికా ఆర్థిక వ్యవస్థకు నష్టమే అంటున్న నిపుణులు

తరువాయి 3లో



# ఇబ్బందైతే కొనకండి!

ముడి చమురు ఉత్పత్తులపై ట్రంప్ సర్కార్‌కు తెగేసి చెప్పిన విదేశాంగ మంత్రి జైశంకర్

స్వప్రయోజనాలతో కూడిన అధికారిక వ్యాపారం మీది! మాది వ్యాపారమంటారా?

ట్రంప్ విదేశాంగ విధానం పూర్తిగా అగమ్యగోచరం

ముందు సొంతిల్లు దిద్దుకోండి అమెరికాకు పదునైన చురకల

ఈ కబురు,న్యూఢిల్లీ: భారత్ నుంచి ముడి చమురు సహా పలు రకాల శుద్ధిచేసిన ఉత్పత్తులను కొనడం మీకు ఇబ్బంది అనుకుంటే అస్సలు కొనొద్దని ట్రంప్ సర్కార్‌కు భారత విదేశాగ మంత్రి జైశంకర్ తెగేసి చెప్పారు. ట్రంప్ పాలనాయంత్రాంగం అనుక్షణం స్వప్రయోజనాలతో వాణిజ్యంచేస్తూ భారత్ సైతం అదేపనిచేస్తుంటే తప్పుబట్టడం హాస్యాస్పదంగా ఉందని జైశంకర్ వ్యాఖ్యానించారు.

తరువాయి 3లో

# కోర్టు గడువులోపు ఎన్నికలు నిర్వహించే యోచనలో ఉన్నామని చెప్పిన సీఎం రేవంత్?

» సుదీర్ఘ చర్చ అనంతరం ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ నిర్ణయం

» న్యాయ సలహాలు, సంప్రదింపులకు భట్టి, ఉత్తమ్, శ్రీధర్‌బాబు, పొన్నం, సీతక్కలతో ప్రత్యేక కమిటీ

» ఎన్నికలకు ఎలా వెళ్లాలన్న దానిపై పీఏసీ సభ్యుల భిన్నాభిప్రాయాలు

» న్యాయ నిపుణులతో చర్చిస్తామన్న డిప్యూటీ సీఎం భట్టి

» బీసీలకు రిజర్వేషన్ల కల్పనపై మూడు ఆప్షన్లను చర్చించామన్న మంత్రి ఉత్తమ్

» సుప్రీంకోర్టుకు ప్రత్యేకంగా వెళ్లేది లేదు.. పాత కేసులోనే వాదనలు వినిపిస్తాం: సీఎం

» ప్రజాప్రభుత్వానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు: టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్

» బీసీ రిజర్వేషన్ల విషయంలో ఎలా ముందుకెళ్లాలన్న దానిపై విస్తృత అభిప్రాయ సేకరణ చేయనున్న కమిటీ... ఈనెల 26 కల్లా నివేదిక



ఈ కబురు, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలను వీలున్నంత త్వరగా నిర్వహించడానికే కాంగ్రెస్ పార్టీ మొగ్గుచూపుతోంది. ఈ విషయంలో కోర్టులకు వెళ్లి కేసులు వేయడం వల్ల కాలయాపన తప్ప ప్రయోజనం లేదని ఆ పార్టీలోని కీలక నేతలు అభిప్రాయపడుతున్నారు. ఈ మేరకు శనివారం సాయంత్రం గాంధీభవన్‌లో జరిగిన టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ), సలహా కమిటీల సమావేశంలో ఈ అంశంపై విస్తృతంగా చర్చ జరిగింది. సమావేశంలో భాగంగా పలువురు సభ్యులు తమ అభిప్రాయాలను వెల్లడించారు కొందరు పార్టీ పరంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పించి ఎన్నికలకు వెళదామని సూచించగా, మరికొందరు మాత్రం అధికారికంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తేనే మంచిదనే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

తరువాయి 2లో

# మంత్రుల తీరు వల్లే యూరియా పాట్లు



» కొరత ఉందంటూ పదే పదే ప్రకటనలు

» కంగారులో పెద్దఎత్తున రైతుల కొనుగోలు

» కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ఈ దుస్థితి

» కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్,ఈ కబురు: రాష్ట్రంలో 11 ఏళ్లుగా లేని యూరి యా కొరత కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఎందుకు వచ్చిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. యూరియా కొరత ఉందంటూ రాష్ట్ర మంత్రు లు పదే పదే చెప్పడం వల్లే రైతులు పెద్ద ఎత్తున కొనుగోలు చేసి నిల్వ చేసుకుంటున్నారన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అడిగిన 50 వేల టన్నుల యూరియాను వెంటనే సమకూర్చాలని కేంద్ర ఎరువుల శాఖ మంత్రి నడ్డాకు చెప్పానని.. రాష్ట్ర ప్రభుత్వం అడిగినంత యూరియాను కేంద్రం సరఫరా చేస్తుందని కిషన్‌రెడ్డి హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు హరీశ్‌రావు ఫామ్‌హౌస్‌లో యూరియా తయారు చేశారా? అని ఎద్దేవా చేశారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి మీడియాతో చిట్ చాట్ చేశారు. హైదరాబాద్ మెట్రో అభివృద్ధికి కేంద్రం వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. మెట్రో కొత్త లైన్ల నిర్మాణాలపై ప్రస్తుతం ఉన్న కంపెనీ ముందుకు రావడం లేదని తెలిపారు. ఈ నేపథ్యంలో కొత్త లైన్ల నిర్మాణం ఎవరు చేపడతారు? ప్రస్తుత నష్టాలను ఎవరు భరిస్తారు? అన్న విషయాలపై స్పష్టత రావాల్సి ఉందన్నారు.

తరువాయి 2లో



# పట్టణ ప్రణాళికలో బయోఫిలిక్ అర్బనిజం

» కాలుష్య, వరదల నివారణకు ఇదే కీలకం

» అదే తరహాలో ఫ్యూచర్ సిటీ అభివృద్ధి

» ఐటీపీఐ సదస్సులో నిపుణులు

ఈ కబురు, హైదరాబాద్: పెరుగుతున్న పట్టణీకరణ, జనాభా, వాయు కాలుష్యం, వరదల నివారణకు బయోఫిలిక్ అర్బనిజమే పరిష్కారమని నిపుణులు స్పష్టం చేశారు. ప్రకృతిలో భాగమై జీవించాలనే సూత్రానికి ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ పెరుగుతోందన్నారు. ఇప్పటికే సింగపూర్ లాంటి దేశాలు దీన్ని చేసి చూపిస్తున్నాయని పేర్కొన్నారు.

తరువాయి 3లో

# సిరిసిల్ల పవర్‌లూమ్ కార్మికులను ఆదుకోవాలి

» డిప్యూటీ సీఎంకు కేటీఆర్ లేఖ



» 2లో

మొదటి పేజీ తరువాయి

# రిజర్వేషన్లపై కాంగ్రెస్ సీనియర్ నేతలతో కమిటీ



ఈ కబురు, హైదరాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు ఎలా ముందుకెళ్లాలనే అంశంపై న్యాయకోవిదుల సలహాలు తీసుకుని ఈ నెల 28లోగా నివేదిక ఇచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలతో కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. పీఏసీ సమావేశంలో చర్చించిన అంశాలను రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ఛైర్మన్ ఈరవత్రి అనిల్‌తో కలిసి వారు మీడియా సమావేశంలో వెల్లడించారు.భట్టి మాట్లాడుతూ... "బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు శాసనసభలో బిల్లులను ఆమోదించి గవర్నర్‌కు పంపితే ఆయన రాష్ట్రపతికి పంపారు. ఆ బిల్లుల ద్వారా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించి ఎన్నికలు జరపాలనుకున్నాం. బిల్లుల ఆమోదంలో ఆలస్యం అవుతుండటంతో హైకోర్టు ఆదేశాల ప్రకారం వచ్చే నెలాఖరులోగా స్థానిక సంస్థల ఎన్నికలకు ఎలా వెళ్లాలనే అంశంపై సమావేశంలో చర్చించాం. ఈ నేపథ్యంలో పార్టీ సీనియర్ నేతలతో కమిటీని పీసీసీ ఏర్పాటు చేస్తుంది. కులగణన సర్వేపై స్వతంత్ర నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకోవాలని పీఏసీ సమావేశంలో తీర్మానించాం. రిజర్వేషన్లను 50 శాతానికే పరిమితం చేస్తూ గత ప్రభుత్వ హయాంలో కేసీఆర్ ఇచ్చిన జీఓపై ఏం చేయాలనే అంశంపై లోతుగా చర్చించాం.

జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి మద్దతివ్వాలి...

తెలంగాణకు చెందిన జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటించినందుకు రాష్ట్ర కాంగ్రెస్ తరఫున హర్షం వ్యక్తం చేస్తున్నాం. ఆయన గొప్ప న్యాయకోవిదుడు. ఉమ్మడి ఏపీ హైకోర్టులో, సుప్రీంకోర్టులో న్యాయమూర్తిగా, గౌహతి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఆయన పౌరహక్కులను కాపాడేలా చరిత్రాత్మక తీర్పులు ఇచ్చారు. ఆయన తెలుగువారు అయినందుకు మేమంతా గర్విస్తున్నాం. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడటానికి పోటీ చేస్తున్న ఆయనకు తెలుగు రాష్ట్రాల రాజకీయ పార్టీలన్నీ మద్దతు తెలపాలని కోరుతున్నాం. పీఏసీ సమావేశంలోనూ దీనిపై తీర్మానించాం.ఓటు చోరీతో భాజపా లబ్ధి పొందుతోందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఉదాహరణలు సహా వెల్లడించారు. ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు ఆయన చేస్తున్న పాదయాత్రకు పీఏసీలో సంపూర్ణ మద్దతు, సంఘీభావం తెలిపాం. ఈ నెల 26న రాష్ట్ర మంత్రులు, సీనియర్ నాయకులంతా కలసి బిహార్ వెళ్లి పాదయాత్రలో పాల్గొనాలని పీఏసీలో నిర్ణయించాం. సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి మృతిపై పీఏసీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఆదివారం సురవరం పార్థివదేహానికి సీఎం, మంత్రులు నివాళులర్పిస్తారు" అని పేర్కొన్నారు.మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ "స్థానిక సంస్థల ఎన్నికల్లో, విద్య, ఉద్యోగాల్లో బీసీ రిజర్వేషన్లపై ఏం చేయాలనే అంశంపై న్యాయ నిపుణులతో విస్తృతంగా చర్చించాలని నిర్ణయించాం. తెలుగు రాష్ట్రాల్లోని ఎంపీలందరూ, అన్ని పార్టీలు తెలుగువారైన జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి ఓటు వేయాలని తెలంగాణ కాంగ్రెస్ తరఫున కోరుతున్నాం. ఆయన అభ్యర్థిత్వానికి దేశవ్యాప్తంగా సానుకూల పవనాలు వీస్తున్నాయి" అని తెలిపారు.

మొదటి పేజీ తరువాయి

# కోర్టు గడువులోపు ఎన్నికలు నిర్వహించే యోచనలో ఉన్నామని చెప్పిన సీఎం రేవంత్?



ఇదే అంశంపై సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ హైకోర్టు ఇచ్చిన గడువులోపు స్థానిక ఎన్నికలు పూర్తిచేసే ఆలోచనలో ప్రభుత్వం ఉందని చెప్పినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అధికారికంగా ఇవ్వగలమా లేదంటే పార్టీపరంగా ప్రకటించి ఎన్నికలకు వెళ్లాలా అనే అంశంపై న్యాయ నిపుణులతో సలహాలు, సంప్రదింపులు జరిపి పార్టీకి నివేదిక ఇచ్చేందుకుగాను ఐదుగురు మంత్రులతో ప్రత్యేక కమిటీని నియమించాలని పీఏసీ నిర్ణయించింది. ఈ నిర్ణయం మేరకు రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, సీఎం రేవంత్‌రెడ్డిలతో చర్చించిన అనంతరం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఈ కమిటీని అధికారికంగా ప్రకటించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, డి.శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్కలు ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారని, దేశంలోని న్యాయ నిపుణులు, పార్టీ నాయకులతో కమిటీ విస్తృతంగా చర్చించి ఈ నెల 26వ తేదీలోపు నివేదికను ఇస్తుందని మహేశ్‌గౌడ్ వెల్లడించారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్ ద్వారా రాష్ట్రపతికి పంపిన బిల్లు ప్రకారం అధికారికంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించగలమా? లేదా పార్టీ పరంగా 42 శాతం రిజర్వేషన్లు ప్రకటించి ముందుకెళ్లాలా అనే అంశాలపై ఈ కమిటీ నివేదిక ఇవ్వనుంది.

**ఆరు ప్రధాన అంశాలే ఎజెండాగా భేటీ**

సమావేశంలో భాగంగా స్థానిక సంస్థల ఎన్నికలు, హైకోర్టు కోర్టు తీర్పు నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలు, ఈ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు గల ఆప్షన్లు, ఏఐసీసీ పిలుపు మేరకు ఓట్ చోరీ, గద్దీ చోడ్ ఉద్యమాన్ని రాష్ట్రంలో విస్తృతంగా చేపట్టడం, రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో అనుసరించాల్సిన వ్యూహాలు, రాష్ట్రంలో యూరియా కొరత, రాజకీయ పరిణామాల గురించి చర్చించారు. సమావేశానికి ముందు ఏఐసీసీ చేపట్టిన ఓట్ చోరీ ప్రచార లోగోను సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఇండియాకూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని ఎంపిక చేయడం పట్ల సమావేశం హర్షం వ్యక్తం చేసింది. రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌గౌడ్, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, సీనియర్ మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, పార్టీ సీనియర్ నేతలు జానారెడ్డి, వీహెచ్, కేకే, జీవన్‌రెడ్డి, జగ్గారెడ్డి, మధుయాష్కీగౌడ్, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్‌లతోపాటు పలువురు మంత్రులు, పీఏసీ సభ్యులు పాల్గొన్నారు.

**లోతుగా చర్చించి నిర్ణయం తీసుకున్నాం: డిప్యూటీ సీఎం భట్టి**

పీఏసీ భేటీ అనంతరం సీనియర్ మంత్రి ఉత్తమ్, మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్‌లతో కలిసి భట్టి విక్రమార్క విలేకరులతో మాట్లాడారు. బీసీలకు స్థానిక సంస్థలతోపాటు విద్య, ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్ల కల్పన, 50 శాతం రిజర్వేషన్ల పరిమితి గురించి పీఏసీ లోతుగా చర్చించిందని చెప్పారు. సెప్టెంబర్ 31 వరకు స్థానిక ఎన్నికల నిర్వహణపై ఎలా ముందుకెళ్లాలన్న దానిపై సుదీర్ఘంగా పలువురు సభ్యుల అభిప్రాయాలను తీసుకున్నామన్నారు. బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చే విషయంలో అధికారికంగా వెళ్లాలా... పార్టీ పరంగా వెళ్లాలా అనే అంశాలపై చర్చించడంతోపాటు, న్యాయ నిపుణుల సలహాలు తీసుకోవాలని, ఇందుకోసం కమిటీని నియమించాలని, ఈనెల 28వ తేదీలోపు కమిటీ నివేదిక ఇవ్వాలని పీఏసీ నిర్ణయించిందని చెప్పారు. కమిటీలో సభ్యులపై టీపీసీసీ అధ్యక్షుడు అధికారికంగా నిర్ణయం తీసుకుంటారన్నారు. న్యాయ నిపుణులతో కమిటీ చర్చించి పార్టీకి నివేదిక ఇచ్చిన అనంతరం కేబినెట్‌లో నిర్ణయం తీసుకొని స్థానిక ఎన్నికల విషయంలో ముందుకు వెళతామని స్పష్టం చేశారు.

తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన అన్ని రాజకీయ పార్టీలు జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి మద్దతు తెలపాలని కోరుతూ పీఏసీలో తీర్మానించినట్టు వెల్లడించారు. దేశంలోని పౌరుల ఓటు హక్కును కాపాడడం, ఓట్ల చోరీని అరికట్టేందుకు బిహార్‌లో రాహుల్‌గాంధీ చేపట్టిన పాదయాత్రపై పీఏసీలో చర్చ జరిగిందని, ఆ పోరాటానికి పీఏసీ సంపూర్ణంగా మద్దతు తెలిపిందన్నారు. ఈనెల 26న పాదయాత్రకు సంఘీభావం తెలిపేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో మంత్రులు, పార్టీ ముఖ్య నేతలు వెళ్లనున్నట్టు చెప్పారు.

**విస్తృతంగా చర్చిస్తాం: మంత్రి ఉత్తమ్**

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఇటు స్థానిక సంస్థల ఎన్నికలు, అటు విద్య, ఉద్యోగ రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల గురించి ఎలా ముందుకెళ్లాలన్న దానిపై మూడు ఆప్షన్లను పీఏసీ భేటీలో చర్చించామని చెప్పారు. ఈ విషయంలో విస్తృత స్థాయిలో పార్టీ నేతలతో పాటు న్యాయ నిపుణులతో మాట్లాడుతామని వెల్లడించారు. అభిషేక్ మనుసింఘ్వి, జస్టిస్ సుదర్శన్‌రెడ్డిలతోపాటు రాష్ట్ర అడ్వొకేట్ జనరల్‌లను అధికారికంగా అభిప్రాయం అడుగుతామని తెలిపారు.

ఘన విజయానికి అవకాశం: పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్

టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాపాలన అద్భుతమైన ఫలితాలనిస్తోందని, జనహిత పాదయాత్రలో భాగంగా వెళ్లినప్పుడు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన విజయం సాధించే అవకాశం ఇప్పుడు పార్టీకి ఉందన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని, పార్టీ గెలుపు కోసం ప్రణాళిక ప్రకారం ముందుకెళ్లాలని చెప్పారు.

**బీసీలకు మేలు జరగాల్సిందే: సీఎం రేవంత్**

పీఏసీ సమావేశంలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో కేసీఆర్ తెచ్చిన చట్టం ప్రకారం ఒక్కశాతం కూడా అదనంగా బీసీలకు రిజర్వేషన్ రాదని, కానీ బీసీలకు మేలు జరగాలన్నదే తమ ఉద్దేశమని చెప్పారు. అందు కోసమే చట్టాన్ని సవరించి ఆర్డినెన్సు తెచ్చామని, ఆ ఆర్డినెన్సును గవర్నర్‌కు పంపితే ఆయన రాష్ట్రపతికి పంపారని చెప్పారు. రాష్ట్రపతికి పంపిన బిల్లులను 90 రోజుల్లో ఆమోదించాలన్న అంశంపై సుప్రీంకోర్టులో మన వాదనలను వినిపించేందుకు ఇద్దరు న్యాయవాదులను నియమించామని చెప్పారు. ఆ కేసులోనే రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్న బీసీ బిల్లు అంశం కూడా వస్తుందని, ప్రత్యేకంగా సుప్రీంకోర్టుకు వెళ్లే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని చెప్పారు. ఒకవేళ అలా వెళ్లే కేసు లిస్టు కావడానికే చాలా సమయం పడుతుందన్నారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని ఎంపిక చేసినందుకుగాను మల్లికార్జున ఖర్గే, సోనియా, రాహుల్‌గాంధీలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈనెల 26న బిహార్‌లో రాహుల్‌గాంధీ నిర్వహిస్తున్న ఓట్ చోరీ పాదయాత్రకు హాజరవుతానని, రాష్ట్రంలో కూడా ఓట్ చోరీ ఉద్యమాన్ని విస్తృతంగా చేపట్టాలని సూచించారు. రాష్ట్రంలో యూరియా కొరతపై బీఆర్ఎస్, బీజేపీలు కలిసి డ్రామాలు ఆడుతున్నాయని, యూరియా ఇచ్చే పార్టీకే ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో మద్దతి స్తానని కేటీఆర్ చెప్పడంలోనే వారి తీరు అర్థమవుతోందన్నారు. యూరియా కోసం తాను నాలుగుసార్లు కేంద్ర మంత్రులు నడ్డా, అనుప్రియా పటేల్‌లను కలిశానని వెల్లడించారు.

మొదటి పేజీ తరువాయి

# అంతరిక్షంలో సుదూర తీరాలను శోధిద్దాం



'మనం చంద్రుడు, అంగారకుడిని చేరుకున్నాం. ఇప్పుడు అనేక రహస్యాలు దాగున్న రోదసిలోని సుదూర తీరాలపై పరిశోధనలు చేయాల్సి ఉంది. దానివల్ల భవిష్యత్తు తరాలకు మరిన్ని వెలుగులు ప్రసాదించే అవకాశం దక్కుతుంది. అంతరిక్ష రంగంలో ఒకదాని తర్వాత మరో విజయం మనకు, మన శాస్త్రవేత్తలకు ఆనవాయితీగా మారిపోయింది. ఏ సరిహద్దూ చివరిది కాదని మనకు విశ్వం చెబుతోంది' అని మోదీ పేర్కొన్నారు. 2040లో భారత్ సొంతంగా చేపట్టే అంతరిక్ష యాత్రలో భారత వ్యోమగామి చంద్రుడిపై అడుగుపెట్టి త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి వికసిత్ భారత్ ఖ్యాతిని చాటుతారని పునరుద్ఘాటించారు. భవిష్యత్తులో ఏడాదికి 50 రాకెట్లను ప్రయోగించే స్థితికి మనం చేరుకోగలమా అని అంతరిక్ష శాస్త్రవేత్తలను ఆయన ప్రశ్నించారు. శాస్త్రవేత్తలు చేస్తున్న కృషితో త్వరలో గగన్‌యాన్ మిషన్‌ను ప్రారంభించనున్నామని, మరి కొన్నేళ్లలో సొంత అంతరిక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసుకుంటామని ప్రధాని పేర్కొన్నారు. అంతరిక్ష రంగ అభివృద్ధికి ప్రైవేటు రంగం మరింతగా ముందుకు రావాలని సూచించారు. అంతరిక్ష విజన్‌లో భాగంగా తదుపరి తరం సంస్కరణలను తెచ్చేందుకు ప్రభుత్వం సంకల్పించిందని తెలిపారు.

# హైదరాబాద్ భవిష్యత్తు కోసం హైడ్రా

హైదరాబాద్ , ఈ కబురు: "హైడ్రా ఏం చేస్తుందన్నది ఏడాదిలో అందరికీ అర్థమవుతుంది. కాలగమనంలో హైడ్రా విశిష్టత తెలుస్తుంది. వంద, రెండు వందల ఏళ్ల హైదరాబాద్ భవిష్యత్తు కోసం.. భవిష్యత్ తరాల ఆరోగ్య జీవనం కోసం సంస్థ పని చేస్తోంది" అని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. గతంలో చెరువుల్లో ఆక్రమణలు తొలగించినప్పుడు శాపనార్థాలు పెట్టిన వారే.. దూషించిన వారే.. ఇప్పుడు చెరువుల వద్ద జరుగుతున్న అభివృద్ధిని చూసి జేజేలు కొడుతున్నారని, కూకట్‌పల్లిలోని నల్లచెరువు ఇందుకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. "పర్యావరణ పరిరక్షణ, ప్రభుత్వ ఆస్తుల రక్షణ, విపత్తుల నిర్వహణ కోసం హైడ్రా ఏర్పాటైంది. దీనిని జాగ్రత్తగా ముందుకు తీసుకెళ్లాలి. సమాజానికి ఉపయోగపడేలా తీర్చిదిద్దాలి. సంస్థ ప్రారంభమైన తొలినాళ్లలో కొన్ని పొరపాట్లు జరిగాయి. వాటినిదిద్దుకుంటూ ముందుకు వెళ్తున్నాం" అని స్పష్టం చేశారు. ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, టీయూడబ్ల్యూజే అధ్యక్షుడు విరాహత్‌అలీ ఆధ్వర్యంలో శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన 'మీట్ ది ప్రెస్'లో రంగనాథ్ పలు అంశాలపై మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా హైడ్రా పనిచేస్తుందని, ఈ సంస్థ ఎప్పటికీ ఉంటుందని స్పష్టంచేశారు. హైడ్రా వల్ల ప్రభుత్వానికి మంచి పేరు వస్తోందా? లేదా? అన్నది కాలమే నిర్ణయిస్తుందని రంగనాథ్ పేర్కొన్నారు. హైడ్రాకు 25వేల ఫిర్యాదులు వచ్చాయని, వాటిపై చర్యలుతీసుకుంటామని చెప్పారు. మీట్ ద ప్రెస్ వివరాలు ఆయన మాటల్లోనే..

**16 నుంచి 28 ఎకరాలకు..**

మొదటివిడతగా ఆరు చెరువుల అభివృద్ధికి శ్రీకారం చుట్టాం. ఇందులో కూకట్‌పల్లి నల్లచెరువు ఒకటి. గతంలో ఈ చెరువు వద్ద 16 నివాసేతర ఆక్రమణలను తొలగించినప్పుడు విమర్శలు వచ్చాయి. ఇటీవల ఆ చెరువు వద్దకు వెళ్తే.. స్థానికులు వచ్చి, సంతోషం వ్యక్తం చేశారు. ఆక్రమణల తొలగింపుతో కొందరికి ఇబ్బంది కలగొచ్చు.. కానీ చాలా మందికి ఉపయుక్తంగా ఉంది. 16 ఎకరాలు ఉన్న ఆ చెరువు విస్తీర్ణం ఇప్పుడు 28 ఎకరాలకు పెరిగింది. ఆదివారం చెరువు పరిసరాల్లో పిక్నిక్ వాతావరణం ఉంటోంది. ఇప్పటి వరకు రూ.30 వేల కోట్ల విలువైన 500ఎకరాలకుపైనా ప్రభుత్వ భూములు, పార్కులు, చెరువుల ఆక్రమణ స్థలాలను స్వాధీనం చేసుకున్నాం. భవిష్యత్‌లో కబ్జా అయ్యే అవకాశాలున్న స్థలాల చుట్టూ కంచె వేస్తున్నాం. ఈ క్రమంలో బెదిరింపులు వస్తున్నాయి. బతుకమ్మ కుంట విషయంలో దావూద్ ఇబ్రహీం తరహాలో కొందరు భయపెట్టే ప్రయత్నాలు చేశారు. ఇప్పటి వరకు 80ుచెరువులకు ప్రాథమిక నోటిఫికేషన్ మాత్రమే విడుదలైంది. ఎఫ్‌టీఎల్‌ను ఇంకా నిర్ధారించలేదు. శాస్త్రీయంగా, సాంకేతికంగా, చట్టపరంగా.. సర్వే ఆఫ్ ఇండియా టోపోషీట్స్, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ మ్యాపులు, రెవెన్యూ, నీటిపారుదల రికార్డుల ఆధారంగా ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారిస్తాం. ఎన్‌జీఆర్ఐ సహకారంతో ఏయే ప్రాంతాల్లో ఎక్కువ నీరు భూమిలోకి ఇంకే



మొదటి పేజీ తరువాయి

# మంత్రుల తీరు వల్లే యూరియా పాట్లు



హైదరాబాద్,ఈ కబురు: రాష్ట్రంలో 11 ఏళ్లుగా లేని యూరి యా కొరత కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఎందుకు వచ్చిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. యూరియా కొరత ఉందంటూ రాష్ట్ర మంత్రు లు పదే పదే చెప్పడం వల్లే రైతులు పెద్ద ఎత్తున కొనుగోలు చేసి నిల్వ చేసుకుంటున్నారన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అడిగిన 50 వేల టన్నుల యూరియాను వెంటనే సమకూర్చాలని కేంద్ర ఎరువుల శాఖ మంత్రి నడ్డాకు చెప్పానని.. రాష్ట్ర ప్రభుత్వం అడిగినంత యూరియాను కేంద్రం సరఫరా చేస్తుందని కిషన్‌రెడ్డి హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు హరీశ్‌రావు ఫామ్‌హౌస్‌లో యూరియా తయారు చేశారా? అని ఎద్దేవా చేశారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి మీడియాతో చిట్ చాట్ చేశారు. హైదరాబాద్ మెట్రో అభివృద్ధికి కేంద్రం వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. మెట్రో కొత్త లైన్ల నిర్మాణాలపై ప్రస్తుతం ఉన్న కంపెనీ ముందుకు రావడం లేదని తెలిపారు. ఈ నేపథ్యంలో కొత్త లైన్ల నిర్మాణం ఎవరు చేపడతారు? ప్రస్తుత నష్టాలను ఎవరు భరిస్తారు? అన్న విషయాలపై స్పష్టత రావాల్సి ఉందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి, అధికార దుర్వినియోగం జరిగాయని ఆరోపించారు. సీబీఐ దర్యాప్తునకు తాము కట్టుబడి ఉన్నామని అన్నారు. తాము ఎవరి మీద చర్య తీసుకోవాల్సిన అవసరం లేదని సీఎం అంటున్నారని.. ఈ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఖరి మార్చుకుందని విమర్శించారు. అమెరికా టారిఫ్‌లు బొగ్గు గనుల శాఖపై ప్రభావం చూపవన్నారు. బీజేపీ నేతలు రేవంత్‌రెడ్డిని తిట్టడం లేదని ఇటీవల కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై కిషన్‌రెడ్డి స్పందించారు. హౌలా అని తిట్టాలా..? అని అన్నారు. రాజకీయ ప్రత్యర్థులను తిట్టడం, అభ్యంతరకరమైన భాష వాడటం తగదని అన్నారు. 'రేవంత్‌రెడ్డి నన్ను సైందవుడు అని అన్నారు. బట్టలు విప్పుతా.. లాగు లో తొండలు వదులుతా అనడం ఏం భాష. మన శత్రువు పాకిస్థాన్. రాజకీయ పార్టీలు కాదు. మనం ప్రత్యర్థులం మాత్రమే' అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఉప రాష్ట్రపతి ఎన్నిక కోసం బీఆర్ఎస్ మద్దతు కోరే విషయంలో ఇంకా నిర్ణయం తీసుకోలేదని కిషన్‌రెడ్డి తెలిపారు. బీజేపీకి మద్దతు ఇవ్వడం వైఎస్సార్‌సీపీ స్వచ్ఛంద నిర్ణయమని చెప్పారు. కాంగ్రెస్ గెలిచే వీలుంటే సుదర్శన్‌రెడ్డిని నిలబెట్టేది కాదని, ఆయన్ను బలీ కా బకరా చేసిందని విమర్శించారు. బీజేపీలో చేరాలంటే ఎవరైనా రాజీనామా చేసి రావాల్సిందేనన్నారు. అన్ని పార్టీల్లో మంచివారు, అవినీతిపరులు ఉంటారని, పార్టీల్లో చేర్చుకోవడం కొత్తేమీ కాదన్నారు.

# పుతిన్ చర్యలతో సంతోషంగా లేను

ఈ కబురు,వాషింగ్టన్: ఉక్రెయిన్ యుద్ధం ఆగే అవకాశాలు తక్కువగా కనిపిస్తున్నాయన్న సంకేతాలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నుంచి వెలువడుతున్నాయి. రష్యా, ఉక్రెయిన్ అధ్యక్షులు పుతిన్, జెలెన్‌స్కీలతో ముఖాముఖి సమావేశాన్ని ఏర్పాటుచేయడం.. నూనె, వెనిగర్‌లను కలపడం లాంటి కష్టమైన ప్రక్రియ అని ట్రంప్ పేర్కొన్నారు. యుద్ధం ముగింపు విషయంలో వారు కలిసి పనిచేస్తారా లేదా అనే విషయంపైనా తనకు స్పష్టత లేదన్నారు. భవిష్యత్తులో వారిద్దరి మధ్య జరిగే సమావేశానికి తాను హాజరవుతానో, లేదో కూడా తెలియదన్నారు. ఉక్రెయిన్‌లోని అమెరికాకు చెందిన ఫ్యాక్టరీపై రష్యా దాడులు చేయడంపైనా ట్రంప్ మండిపడ్డారు. ఈ విధమైన రెచ్చగొట్టే చర్యలకు పాల్పడితే మాస్కో భారీ ఆంక్షలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. యుద్ధం ముగింపునకు తాను ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ పుతిన్ తీసుకుంటున్న చర్యలతో తాను ఏమాత్రం సంతోషంగా లేనని అమెరికా అధ్యక్షుడు పేర్కొన్నారు. యుద్ధం విషయంలో జెలెన్‌స్కీ, పుతిన్‌ల వైఖరి తెలుసుకోవడానికి తనకు రెండు వారాల సమయం పడుతుందని.. అప్పటిలోపు వారు ఓ ఒప్పందానికి రాకపోతే ఈ విషయంలో తానే నిర్ణయం తీసుకుంటానని.. అది భారీ ఆంక్షలా లేదా సుంకాలా లేకపోతే రెండూనా అనేది తెలియజేస్తానని పేర్కొన్నారు. మాస్కో-కీవ్ మధ్య శాంతిచర్చల ప్రయత్నాలు ముమ్మరం చేసిన ట్రంప్.. ఇటీవల అలాస్కాలో పుతిన్‌తో వాషింగ్టన్‌లో జెలెన్‌స్కీ, ఐరోపా దేశాల నేతలతో చర్చలు జరిపిన సంగతి తెలిసిందే.

**ఫర్నీచర్ దిగుమతులపై సుంకాలు.. ట్రంప్ తాజా హెచ్చరిక**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫర్నిచర్ దిగుమతులపై సుంకాలు విధిస్తామని తాజాగా హెచ్చరించారు. "అమెరికాలోకి వచ్చే ఫర్నీచర్‌పై మేం భారీస్థాయిలో సుంకాల విధించే అంశంపై దర్యాప్తు నిర్వహిస్తున్నాం. 50 రోజుల్లో విచారణ పూర్తవుతుంది" అని ట్రంప్ తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. అయితే ఎంతమేరకు సుంకం విధిస్తారనే దానిపై ప్రస్తుతానికి స్పష్టత లేదు. నార్త్ కరోలినా, సౌత్ కరోలినా, మిషిగన్‌లలో తిరిగి ఫర్నీచర్ పరిశ్రమను ప్రోత్సహించేందుకే ఈ చర్యలని పేర్కొన్నారు.



# సిరిసిల్ల పవర్‌లూమ్ కార్మికులను ఆదుకోవాలి

ఈ కబురు, హైదరాబాద్: సిరిసిల్ల పవర్‌లూమ్ కార్మికులు ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యల్ని ప్రభుత్వం పరిష్కరించాలని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. చేనేత కార్మికులపై పడుతున్న రూ.35.48 కోట్ల బకాయిలు వెంటనే మాఫీ చేయాలని, సహకార విద్యుత్తు సొసైటీకి రావాల్సిన రూ.101.77కోట్ల సబ్సిడీ విడుదల చేయాలని కోరారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు లేఖ రాశారు. కుటీరపరిశ్రమల కేటగిరీ కింద 50శాతం విద్యుత్తు రాయితీ పొందుతున్న ఈ యూనిట్లను చిన్నతరహా పరిశ్రమలుగా పేర్కొని కేటగిరీ3 కిందకు తీసుకువచ్చారని తెలిపారు. దీంతో 127 చిన్నతరహా యూనిట్లు, 191 ఇతర యూనిట్లకు రూ.35.48 బ్యాక్ బిల్లింగ్ బకాయిలు వచ్చాయన్నారు. ఈ మొత్తాన్ని చెల్లించే స్థితిలో కార్మికులు లేరని, పవర్‌లూమ్స్ నడపడం కష్టంగా మారుతోందన్నారు. ప్రభుత్వం నుంచి సబ్సిడీ రాకపోవడంతో సమస్యలు అధికమయ్యాయన్నారు. నేతన్నలను ఆదుకుని జీవనోపాధి పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.



# కేబినెట్ భేటీ ఈనెల 29కి వాయిదా?



## స్థానిక ఎన్నికలపై కాంగ్రెస్ వైఖరి స్పష్టమయ్యాకే నిర్వహణ

ఈ కబురు, హైదరాబాద్: రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈనెల 29వ తేదీకి వాయిదా పడింది. వాస్తవానికి 25న మంత్రివర్గ సమావేశం నిర్వహించాలని అనుకున్నప్పటికీ శనివారం జరిగిన కాంగ్రెస్ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో స్థానిక సంస్థలకు ఎన్నికల నిర్వహణ విషయంలో ఆ పార్టీ వైఖరి స్పష్టం కాలేదు. ఎన్నికలకు వెళ్లాలని ఆలోచన ఉన్నప్పటికీ న్యాయ నిపుణులతో సంప్రదింపులు జరిపేందుకు కాంగ్రెస్ పార్టీ మంత్రుల కమిటీని ఏర్పాటు చేసింది ఈ కమిటీ నివేదిక ఇచ్చిన అనంతరం పార్టీ తన వైఖరిని అధికారికంగా ప్రకటించనుంది ఈ నేపథ్యంలో పార్టీ వైఖరి స్పష్టమైన తర్వాతే కేబినెట్ భేటీ జరిపి స్థానిక సంస్థల ఎన్నికలపై నిర్ణయం తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి భావిస్తున్నట్టు సమాచారం.

# వాట్సప్, ఈమెయిళ్లలో దూషించారన్న ఆరోపణలకు ఎస్సీ, ఎస్టీ చట్టం వర్తించదు



## వి బహిరంగ ప్రదేశాల నిర్వచనం కిందకు రావు: హైకోర్టు

ఈ కబురు, హైదరాబాద్: నాలుగు గోడల మధ్య జరిగిన ఘటనలు, వాట్సప్ మెసేజ్‌లు, ఈమెయిళ్లు బహిరంగ ప్రదేశాల నిర్వచనం కిందకు రావని... వాటిలో కులం పేరుతో దూషించారన్న ఆరోపణలకు ఎస్సీ, ఎస్టీ కేసు వర్తించదని హైకోర్టు తేల్చిచెప్పింది. చట్టం నిబంధనలతో పాటు సుప్రీంకోర్టు తీర్పుల ప్రకారం బహిరంగ ప్రదేశంలో ఘటన జరిగినపుడే ఎస్సీ, ఎస్టీ కేసు వర్తిస్తుందని, భార్యాభర్తల మధ్య నాలుగు గోడల మధ్య జరిగిన ఘటనపై ఎస్సీ, ఎస్టీ కేసు కొనసాగించడం న్యాయప్రక్రియను దుర్వినియోగం చేయడమేనంది. విడాకులు తీసుకున్న తరువాత తనపై మాజీ భర్త కె.క్రాంతికిరణ్ పెట్టిన ఎస్సీ, ఎస్టీ కేసును కొట్టివేయాలని కోరుతూ సికింద్రాబాద్‌కు చెందిన డి.నిరుపమ, ఆమె తండ్రి అనుపమబాబు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ ఇ.వి.వేణుగోపాల్ ఇటీవల విచారణ చేపట్టారు.పిటిషనర్ల తరపు న్యాయవాది విమల్ వర్మ వాసిరెడ్డి వాదనలు వినిపిస్తూ మొదటి భర్త నుంచి విడిపోయిన నిరుపమ... కె.క్రాంతికిరణ్‌ను రెండో పెళ్లి చేసుకున్నారని తెలిపారు. అనంతరం అభిప్రాయ భేదాలు రావడంతో పరస్పర అంగీకారంతో విడాకులు పొందారన్నారు. వాట్సప్ మెసేజ్‌లు, ఈమెయిళ్ల ఆధారంగా 10 నెలల తరువాత కె.క్రాంతికిరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పిటిషనర్లపై కేసు నమోదైందని పేర్కొన్నారు. దంపతుల మధ్య వివాదంలో జరిగిన ఘటన అని... వాట్సప్ మెసేజ్‌లు, ఈమెయిళ్లు బహిరంగ ప్రదేశాల నిర్వచనం కిందకు రావంటూ హితేశ్ వర్మ వర్సెస్ ఉత్తరాఖండ్ స్టేట్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం ఎస్సీ, ఎస్టీ కేసు వర్తించదన్నారు. వాదనలను విన్న న్యాయమూర్తి... బహిరంగ ప్రదేశంలో దూషించినట్లు ఆధారాలు లేవని, ప్రత్యక్షంగా చూసినట్లు స్వతంత్ర సాక్షులు ఎవరూ చెప్పలేదన్నారు. దాంపత్య వివాదంతో పాటు ప్రైవేటుగా ఇంట్లో జరిగిన ఘటనపై ఎస్సీ, ఎస్టీ కేసును కొనసాగించలేమన్నారు. పిటిషనర్లపై కింది కోర్టులో ఉన్న ఎస్సీ, ఎస్టీ కేసును కొట్టివేస్తూ తీర్పు వెలువరించారు.

# చైనాలో రైల్వే వంతెన కూలి 12 మంది కార్మికుల మృతి

ఈ కబురు,బీజింగ్: వాయువ్య చైనాలోని చిన్‌ఘై ప్రావిన్సులో ఓ ప్రధాన నదిపై నిర్మాణంలో ఉన్న రైల్వే వంతెన కూలి 12 మంది మృతిచెందారు. మరో నలుగురు గల్లంతయినట్లు అధికారిక వార్తాసంస్థ తెలిపింది. నదీ జలాలకు 55 మీటర్ల ఎత్తున 1.6 కిలోమీటర్ల పొడవున నిర్మిస్తున్న ఈ వంతెనపై 16 మంది కార్మికులు ఒకచోట పని చేస్తుండగా.. శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో ప్రమాదం సంభవించింది. ఉక్కు తీగ తెగిపోవడంతో వంతెన రెండు ముక్కలుగా వేలాడుతూ కనిపించింది. గల్లంతైన కార్మికుల ఆచూకీ కోసం పడవలు, హెలికాప్టర్లు, రోబోలను రంగంలో దించారు.

# సురవరంకు నివాళులర్పించిన సిపిఐ అగ్రనేతలు



సుధాకర్ రెడ్డి పార్థీవదేహానికి నివాళులర్పిస్తున్న సిపిఐ అగ్రనాయకులు, ప్రముఖులు



సురవరం సుధాకర్ రెడ్డి

- నేడు ప్రజల సందర్శనార్థం ముఖ్దూమ్ భవన్ కు సుధాకర్ రెడ్డి పార్థీవదేహం
- సాయంత్రం గాంధీ మెడికల్ కళాశాలకు అప్పగింత

ఈకబురు, శేరిలింగంపల్లి : సిపిఐ అగ్రనేత, మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపి సురవరం సుధాకర్ రెడ్డి పార్థీవదేహానికి సిపిఐ అగ్రనేతలు, పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. సురవరం సుధాకర్ రెడ్డి(83) గచ్చిబౌలి కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి తుదిశ్వాస విడిచిన విషయం తెలిసిందే. శేరిలింగంపల్లి పరిధిలోని ఖాజాగూడలో నివాసం ఉంటున్న సుధాకర్ రెడ్డికి భార్య బివి. విజయలక్ష్మి, ఇద్దరు కుమారులు నిఖిల్, కపిల్ లు ఉన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలం కంచుపాడు గ్రామానికి చెందిన సురవరం సుధాకర్ రెడ్డి విద్యార్థి దశలోనే కమ్యూనిస్టు భావజాలానికి ఆకర్షితులయ్యారు. సుధాకర్ రెడ్డి స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబం నుంచి వచ్చారు. సుధాకర్ రెడ్డి పెదనాన్న సురవరం ప్రతాపరెడ్డి, తండ్రి వెంకట్రామిరెడ్డిలు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు. పార్టీలో అంచెలంచెలుగా ఎదుగుతూ జాతీయ ప్రధాన కార్యదర్శిగా, రెండుసార్లు ఎంపిగా ఎన్నికయ్యారు. వృద్ధాప్యంతో కొన్నిరోజులుగా రాజకీయాలకు దూరంగా ఉన్న సుధాకర్ రెడ్డి కుటుంబంతో నగరంలో నివాసం ఉంటున్నారు. కాగా గతకొన్ని రోజుల క్రితం సుధాకర్ రెడ్డి తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ సభ్యులు గచ్చిబౌలిలోని కేర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి 10.20 గంటలకు సురవరం సుధాకర్ రెడ్డి తుదిశ్వాస విడిచారు. కాగా సుధాకర్ రెడ్డి కుమారుడు విదేశాల్లో ఉండడంతో ఆయన రాకకోసం పార్థీవదేహాన్ని శనివారం ఆసుపత్రిలోనే ఉంచారు. దీంతో శనివారం పలువురు సిపిఐ అగ్రనేతలు, ప్రముఖులు ఆసుపత్రికి చేరుకొని సురవరం సుధాకర్ రెడ్డికి నివాళులర్పించారు. సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శి నారాయణ, అగ్ర నాయకులు సయ్యద్ అజీజ్ పాషా, సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకటరెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటి. నరసింహ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఛాయాదేవి, సంగారెడ్డి జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలుద్దీన్ తో పాటు తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఆసుపత్రికి చేరుకొని సుధాకర్ రెడ్డి భౌతికకాయానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి పార్టీకి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. సురవరం సుధాకర్ రెడ్డి మృతిపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ లు సంతాపం వ్యక్తం చేశారు. దేశ రాజకీయాల్లో తనదైన ముద్రవేసిన గొప్ప నాయకుడిని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. సురవరం కుటుంబ సభ్యులకు తమ ప్రగాడ సానుభూతిని తెలిపారు. వీరితో పాటు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, మాజీ మంత్రులు హరీష్ రావు, తలసాని శ్రీనివాసయాదవ్ తదితరులు సంతాపం తెలిపారు. సురవరంతో తమకు ఉన్న అనుబంధాన్ని, ఆయన చేసిన ప్రజా పోరాటాలు, ఉద్యమాలను గుర్తు చేసుకున్నారు.


**నేడు ముఖ్దూమ్ భవన్ కు సుధాకర్ రెడ్డి పార్థీవదేహం...**

సురవరం సుధాకర్ రెడ్డి పార్థీవదేహాన్ని ఆదివారం ఉదయం 9 గంటలకు గచ్చిబౌలి కేర్ ఆసుపత్రి నుంచి సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యాలయం ముఖ్దూమ్ భవన్ కు తరలించనున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు వివిధ పార్టీల నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజల సందర్శనార్థం సుధాకర్ రెడ్డి పార్థీవదేహాన్ని ముఖ్దూమ్ భవన్ లో ఉంచనున్నట్లు ప్రకటించారు. మధ్యాహ్నం 3 గంటలకు ముఖ్దూమ్ భవన్ నుంచి సుధాకర్ రెడ్డి అంతిమయాత్ర ప్రారంభం అవుతుందని, సాయంత్రం 5 గంటలకు సుధాకర్ రెడ్డి పార్థీవదేహాన్ని గాంధీ మెడికల్ కళాశాలకు అందజేయనున్నట్లు తెలిపారు.

# ఖజానా దోపిడీలో ఇద్దరు ప్రధాన నిందితుల అరెస్టు



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న కమీషనర్ అవినాష్ మహంతి తదితరులు



నిందితుల వద్ద స్వాధీనం చేసుకున్న సొత్తు, పిస్తోలు

- ఇప్పటి వరకు మొత్తం 6గురు నిందితులు అరెస్టు
- ఓ పిస్తోలు, 1915 గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనం

ఈకబురు, శేరిలింగంపల్లి : చందానగర్ ఖజానా జ్యూవెల్లర్స్ లో దోపిడీకి పాల్పడిన ఇద్దరు ప్రధాన నిందితులు పోలీసుల చేతికి చిక్కారు. గతంలోనే ఈ దోపిడీలో పాల్గొన్న ముగ్గురు నిందితులు, సహకరించిన ఓ నిందితుడిని పోలీసులు అరెస్టు చేయగా, తాజాగా దోపిడీకి పథకం వేసిన ఇద్దరు ప్రధాన నిందితులను సైతం పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో ఇప్పటి వరకు మొత్తం 6గురు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు వీరి వద్ద నుంచి 1915 గ్రాముల బంగారు పూతతో ఉన్న వెండి ఆభరణాలను, ఓ పిస్తోలును స్వాధీనం చేసుకున్నారు. కాగా దోపిడీలో పాల్గొన్న ఓ నిందితుడు, దోపిడీ అనంతరం వీరికి సహకరించిన మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారు. ఈమేరకు శనివారం సైబరాబాద్ కమీషనరేట్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో కమీషనర్ అవినాష్ మహంతి, డిసిపి వినీత్ లు ఈ కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. చందానగర్ లోని ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న ఖజానా జ్యూవెల్లర్స్ లో ఆగస్టు 12వ తేదీన ముసుగులు ధరించిన 6గురు దుండగులు ఆయుధాలు, పిస్తోలుతో ప్రవేశించారు. షోరూమ్ డిప్యూటీ మేనేజర్ సతీష్ కుమార్ మీద కాల్పులు జరిపి 10కిలోల బంగారు పూతతో ఉన్న వెండి అభరణాలను దోపిడీ చేసి ద్విచక్రవాహనాల మీద అక్కడి నుంచి పారిపోయారు. దోపిడీ అనంతరం కేసు నమోదు చేసిన సైబరాబాద్ పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. ఆగస్టు 15వ తేదీన పూణెలో దోపిడీకి పాల్పడిన అశిష్ కుమార్ సింగ్, అతను ఇచ్చిన సమాచారంతో ఈ ముఠాకు నగరంలో షెల్టర్ ఇచ్చి, వాహనాలు సమకూర్చి సహకరించిన దీపక్ కుమార్ లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 900 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆగస్టు 19వ తేదీన పూణెలోని పింప్రీ వద్ద దోపిడీలో పాల్గొన్న ఆనీష్ కుమార్ సింగ్, ప్రిన్స్ కుమార్ రజాక్ లను అరెస్టు చేసి వీరి వద్ద నుంచి 1015 గ్రాముల వెండి ఆభరణాలను, ఓ పిస్తోలును స్వాధీనం చేసుకున్నారు. కాగా తాజాగా ఈ దోపిడీకి పథక రచన చేసిన ప్రధాన నిందితులు ప్రిన్స్ కుమార్ భారతీ, రోహిత్ కుమార్ రజాక్ లను గుజరాత్ లోని అంకలేశ్వర్ ప్రాంతంలో పోలీసులు అరెస్టు చేశారు. దీంతో ఈ కేసులో ఇప్పటి వరకు మొత్తం 6గురు నిందితులను పోలీసులు అరెస్టు చేయగా. అందులో ఒకరు దోపిడీకి సహకరించిన నిందితుడు కాగా, మిగిలిన ఐదుగురు దోపిడీలో పాల్గొన్న వారు ఉన్నారు. దోపిడీలో పాల్గొన్న మరో నిందితుడు, దోపిడీ అనంతరం వీరికి సహకరించిన మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నట్లు కమీషనర్ తెలిపారు. తాజాగా అరెస్టు చేసిన ప్రిన్స్ కుమార్ భారతీనే ఈ దోపిడీకి పథక రచన చేశాడని, ఇతడు ఆర్మ్స్ యాక్ట్, దోపిడీ, ఎన్డిపిఎస్ వంటి 6 కేసుల్లో నిందితుడిగా ఉన్నాడని, రెండు కేసుల్లో పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడిన మరో నిందితుడు రోహిత్ కుమార్ రజాక్ సైతం గతంలో ఆర్మ్స్ యాక్ట్, దోపిడీ కేసుల్లో నిందితుడిగా ఉన్నాడని, చందానగర్ ఖజానా జ్యూవెల్లరీ దోపిడీలో డిప్యూటీ మేనేజర్ మీద కాల్పులు జరిపింది రోహిత్ కుమార్ గా గుర్తించినట్లు తెలిపారు. కోర్టు ఆదేశాలతో ఇద్దరిని కస్టడీకి తీసుకుంటామని, మిగిలిన ఆభరణాలు, గన్స్ పై విచారిస్తామని కమీషనర్ తెలిపారు.

# ఇబ్బందైతే కొనకండి!



పలుదేశాలపై ఎడాపెడా పన్నుల పిడిగుద్దులు కురిపించే ట్రంప్ అవలంభించే విదేశాంగ విధానం పూర్తిగా అగమ్యగోచరంగా తయారైందని ఎద్దేవాచేశారు. ఢిల్లీలో జరుగుతున్న 'వరల్డ్ లీడర్స్ ఫోరమ్'లో ఆయన అతిథిగా పాల్గొని పలు అంశాలపై నిర్మొహమాటంగా మాట్లాడారు. "మా సరుకు కొనాలని మీపై ఒత్తడి చేయట్లేదు కదా. మీరు భారతీయ చమురు ఉత్పత్తులను కొనకపోతే వేరే దేశాలు కొంటాయి. సరుకులను యూరప్ అమ్ముతుంది. అమెరికా కూడా అమ్ముతుంది.

భారత్ సైతం అమ్ముతుంది. మావి వద్దనుకుంటే, సమస్య అనుకుంటే కొనకుంటే సరిపోతుందికదా"అని జైశంకర్ వ్యాఖ్యానించారు.'అమెరికా సంప్రదాయక విదేశాంగ విధానానికి ట్రంప్ తిలోదకాలిచ్చారు. ఏ దేశం గురించి ఆయన ఏం అనుకుంటున్నారో ఎవ్వరికీ తెలీదు. అసలు ట్రంప్ సారథ్యంలో అమెరికా విదేశాంగ విధానం అగమ్యగోచరంగా, అధ్వానంగా తయారైంది. ఇలాంటి విదేశాంగ విధానాన్ని, ఇంత బాహాటంగా అమలుచేసిన అమెరికా అధ్యక్షుడిని ప్రపంచం కనీవినీ ఎరుగదు.

సొంత వ్యాపారం, వాణిజ్యం పెంచుకోవడంపైనే ట్రంప్ సర్కార్ దృష్టిపెడుతుందని అందరూ అంటారు. మరి అలాంటప్పుడు భారత్ వంటి దేశాలు రష్యా వంటి దేశాలతో వాణిజ్యం చేస్తుంటే మీకొచ్చిన ఇబ్బంది ఏంటి?. మీరు చేస్తున్న పనిని వేరొకరు చేయొద్దనడం హాస్యాస్పదం. సొంతింటిని గాలికొదిలేసి పక్కింట్లో ఏం జరుగుతుందా అని ట్రంప్ యంత్రాంగం తొంగి చూస్తుంటే నవ్వొస్తోంది. ముందు మీ ఇంటిని చక్కదిద్దుకోండి"అని ట్రంప్‌కు జైశంకర్ చురకటించారు.

**మధ్యవర్తిత్వం ఉత్తిదే**

"మేలో ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్తాన్, భారత్ యుద్ధంలో మునిగిపోకుండా తాను ఆపానని బీరాలు పలుకుతున్న ట్రంప్ మాటల్లో ఆవగింజంత అయినా నిజం లేదు. అసలు మధ్యవర్తిత్వాన్ని భారత్ ఏనాడూ ప్రోత్సహించలేదు. గతంలోనూ తగాదా తీర్చమని ఎవ్వరినీ పెద్దమనిగా పిలవలేదు. 1970వ దశకం నుంచి చూసినా గత అర్ధశతాబ్దకాలంలో పాకిస్తాన్‌తో పొరపొచ్చాలకు సంబంధించి ఎలాంటి మధ్యవర్తిత్వాన్ని అంగీకరించకూడదని భారత్ ఏనాడో నిర్ణయించుకుంది"అని అన్నారు.

**అన్నింట్లో వైఖరి సుస్పష్టం**

"ప్రతి అంశానికి సంబంధించి భారత్‌కు స్పష్టమైన విధానముంది. అమెరికా 50 శాతం టారిఫ్‌లు విధించినాసరే ఎలాంటి వాణిజ్య ఒప్పందాల్లోనైనా మన రైతుల ప్రయోజనాలే భారతప్రభుత్వానికి అత్యున్నతం. వ్యూహాత్మక వాణిజ్యం మొదలు రక్షణ, టారిఫ్‌లు, మధ్యవర్తిత్వం దాకా ప్రతి అంశంలో భారత్ స్వీయప్రయోజనాలకే విలువ ఇస్తుంది. అమెరికాతో వాణిజ్య ఒప్పందానికి సంబంధించి అమెరికా ప్రతినిధి బృందంతో ఇంకా చర్చలు కొనసాగుతున్నాయి.

సాగు, డెయిరీ ఉత్పత్తుల విషయంలో రైతుల ప్రయోజనాలు, సూక్ష్మ,చిన్న,మధ్యతరహా పరిశ్రమల పరిరక్షణకు భారత్ పట్టుబట్టడంతో ఈ అంశాల్లో ఇంకా ప్రతిష్టంభన కొనసాగుతోంది"అని జైశంకర్ అన్నారు. పన్నుల భారం మోపడంతో అమెరికా సత్సంబంధాలు సన్నగిల్లి కొత్తగా చైనాతో బంధం కాస్తంత బలపడిందన్న వాదనను ఆయన కొట్టిపారేశారు. "ఒక సందర్భాన్ని వేరొక సందర్భంతో పోల్చిచూసి తుది నిర్ణయానికి, అంచనాకు రావడం సబబుకాదు"అని వ్యాఖ్యానించారు.

# అమెరికాలో వలసదార్లు తగ్గుముఖం




ఈ కబురు,వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత వలసదార్లకు కష్టాలు మొదలయ్యాయి. ట్రంప్ సర్కార్ విధానాలతో విదేశీయులు బిక్కుబిక్కుమంటూ రోజులు లెక్కబెట్టుకొనే పరిస్థితి వచ్చింది. ఎవరిని ఎప్పుడు వెళ్లగొడతారో తెలియడంలేదు. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తొలి రోజుల్లోనే 'సామూహిక తరలింపులకు' తెరలేపారు. వేలాది మందిని బలవంతంగా స్వదేశాలకు పంపించారు. కాళ్లకు చేతులకు సంకెళ్లు వేసి మరీ విమానాల్లో తరలించారు. చట్టాలను ఉల్లంఘించారంటూ అభియోగాలు మోపి విదేశీయులను అరెస్టు చేస్తున్నారు. అమెరికాలోకి ప్రవేశంపై కొత్తకొత్త ఆంక్షలు విధిస్తున్నారు. వీసాలు రద్దు చేస్తున్నారు. ఈ పరిణామాలన్నీ వలసదార్లను బెంబేలెత్తిస్తున్నాయి. చాలామంది అమెరికాను వీడుతున్నారు. అమెరికాలో ఈ ఏడాది జనవరి నుంచి జూన్ దాకా.. కేవలం ఆరు నెలల్లో వలసదార్ల సంఖ్య ఏకంగా 15 లక్షలు తగ్గినట్లు 'ప్యూ రీసెర్చ్ సెంటర్' తాజాగా ఒక నివేదికలో వెల్లడించింది. అగ్రరాజ్యంలో 1960వ దశకం తర్వాత ఇమ్మిగ్రెంట్స్ సంఖ్య ఈ స్థాయిలో తగ్గి పోవడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. ఈ ఏడాది అరంభంలో దేశంలో మొత్తం వలసదార్లు 5.33 కోట్ల మంది ఉండగా, ప్రస్తుతం 5.19 కోట్లకు పడిపోయింది.

వలసదార్లు వెనక్కి వెళ్లిపోతుండడం వల్ల అమెరికా ఆర్థిక వ్యవస్థకు భారీగా నష్టం వాటిల్లుతుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆరు నెలల్లో తగ్గిపోయిన ఇమ్మిగ్రెంట్లలో 7.50 లక్షల మంది కార్మికులే ఉంటారని అంచనా. కార్మికులు వెళ్లిపోతే లేబర్ మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం పడుతుందని చెబుతున్నారు.

అమెరికాలో జనాభాలో 'పనిచేసే సామర్థ్యం కలిగిన' వారి సంఖ్య పెరగడం లేదు. వర్కింగ్ -ఏజ్ పీపుల్ సరిపడా లేకపోతే వలసదార్లపై ఆధారపడాల్సిందే.

కొత్త వలసదార్లు రాకపోగా, ఉన్నవారే స్వదేశాలకు, ఇతర దేశాలకు వెళ్లిపోతుండడంతో ఆర్థిక వ్యవస్థ దిగజారుతుందని నిపుణులు తేల్చిచెబుతున్నారు. ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు.

నిజానికి వలసదార్లపై కఠిన ఆంక్షలు 2024లో జో బైడెన్ ప్రభుత్వ హయాంలోనే మొదలయ్యాయి. విదేశీయుల రాకను సరిహద్దుల్లో కట్టడిచేశారు. ట్రంప్ వచ్చాక ఆంక్షల మరింత తీవ్రమయ్యాయి. విదేశీయులను బయటకు వెళ్లగొట్టడమే ఏకైక లక్ష్యం అన్నట్లుగా ట్రంప్ ప్రభుత్వం పనిచేస్తోంది. ఇలాంటి పరిస్థితి గత 70 ఏళ్లలో ఎప్పుడూ లేదు.

అమెరికాలో చట్టబద్ధమైన వలసదార్లే కాకుండా అక్రమ వలసదార్ల సంఖ్య కూడా వేగంగా తగ్గిపోతోంది.

ప్రపంచవ్యాప్తంగా చూస్తే వలసదార్లు అత్యధికంగా ఉన్న దేశాల జాబితాలో అగ్రస్థానం ఇప్పటికీ అమెరికాదే. ఈ ఏడాది జనవరిలో దేశ జనాభాలో వలసదార్ల వాటా 15.8 శాతం కాగా, జూన్ నాటికి 15.4 శాతానికి పడిపోయినట్లు గణాంకాలు స్పష్టంచేస్తున్నాయి.

అమెరికాలోని టెక్సాస్, కాలిఫోర్నియా రాష్ట్రాల్లోనే అత్యధికంగా ఇమ్మిగ్రెంట్లు ఉన్నారు.

# పట్టణ ప్రణాళికలో బయోఫిలిక్ అర్బనిజం



ఈ కబురు, హైదరాబాద్: పెరుగుతున్న పట్టణీకరణ, జనాభా, వాయు కాలుష్యం, వరదల నివారణకు బయోఫిలిక్ అర్బనిజమే పరిష్కారమని నిపుణులు స్పష్టం చేశారు. ప్రకృతిలో భాగమై జీవించాలనే సూత్రానికి ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ పెరుగుతోందన్నారు. ఇప్పటికే సింగపూర్ లాంటి దేశాలు దీన్ని చేసి చూపిస్తున్నాయని పేర్కొన్నారు. మన దేశంలో పట్టణ ప్రణాళికలు, మాస్టర్‌ప్లాన్లలో ఈ అంశాన్ని మిళితం చేయడం కీలకమని సూచించారు. హైదరాబాద్ గచ్చిబౌలిలో శనివారం నిర్వహించిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టౌన్‌ప్లానర్స్ ఇండియా(ఐటీపీఐ) సౌత్‌జోన్ సదస్సును ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో ఐటీపీఐ అధ్యక్షుడు ఎన్‌కే పటేల్, సెక్రటరీ జనరల్ కుల్ శ్రేష్ఠ, కోఆర్డినేటర్ ప్రదీప్‌కుమార్, ఐటీపీఐతెలంగాణ రీజినల్ చాప్టర్ ఛైర్మన్ ఎస్.దేవేందర్‌రెడ్డి, కార్యదర్శి కె.మురళీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'పాలసీస్ అండ్ స్ట్రాటజీస్ టువర్డ్స్ బయోఫిలిక్ అర్బనిజం' అనే అంశంపై పలువురు అధికారులు, పట్టణ ప్రణాళిక నిపుణులు మాట్లాడారు. పట్టణ ప్రాంతాల్లో పచ్చదనం అభివృద్ధి, జలసంరక్షణ, కర్బన ఉద్గారాల తగ్గింపు, మురుగునీటి నిర్వహణలో తెలంగాణ తీసుకుంటున్న చర్యలు దేశానికి ఆదర్శం. భావితరాలకు మూసీ ప్రక్షాళన అవసరం. మనం రక్షించే ప్రతి అడవి, నది, సృష్టించే ప్రతి ఉపాధి భవిష్యత్తు తరాలకు అండగా నిలుస్తుంది. భవనాలను నిర్మించడమే అభివృద్ధి కాదు. పర్యావరణ పరిరక్షణ, మురుగు నీటి నిర్వహణ, పచ్చదనమూ కీలకమే. వీటిని దృష్టిలో పెట్టుకొని నగర ప్రణాళికలకు రూపకల్పన చేయాలి. మురుగు, వరద నీటి నిర్వహణ కీలకంపట్టణాల్లో మురుగు, వరద నీటి నిర్వహణ సవాలుగా మారుతోంది. హైదరాబాద్‌లో 100 శాతం మురుగు నీటిని శుద్ధి చేయనున్నాం. దేశంలో ఒక నగరంలో వందశాతం మురుగు శుద్ధి చేయడం ఇదే ప్రథమం. 54 కిలోమీటర్ల పరిధిలో మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధికి శ్రీకారం చుట్టాం.

ఇలంబర్తి, పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి వ్యర్థాలతో విద్యుత్తు తయారీలో దేశానికి ఆదర్శంవ్యర్థాలను సమర్థంగా వినియోగించుకోవడంలో హైదరాబాద్ మహానగర పాలకసంస్థ దేశానికి ఆదర్శంగా నిలుస్తుంది. రోజూ 800 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుండగా దాని నుంచి ఇప్పటికే 24 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేస్తున్నాం. త్వరలో మరో 24 మెగావాట్ల కరెంటు అందుబాటులోకి రానుంది. ఆర్‌వీ కర్ణన్, జీహెచ్‌ఎంసీ కమిషనర్బయోఫిలిక్ అర్బనిజంలో ఇలా చేస్తారు...పచ్చదనం పెంపునకు పార్కుల అభివృద్ధిరూఫ్ గార్డెనింగ్, వర్టికల్ గార్డెన్స్ రూపకల్పననీటి వనరుల పరిరక్షణకు తోడు పక్కాగా మురుగు, వరద నీటి నిర్వహణ

2025 నాటికి 58% ప్రపంచ జనాభా పట్టణాల్లోనే నివసిస్తుంది.

ఆసియా, ఆఫ్రికాలో 90% పెరుగుదల ఉంటుంది

2050 నాటికి ఇండియాలో 814 మిలియన్ల జనాభా పట్టణాల్లో నివసిస్తారు

2030 నాటికి దేశంలో మిలియన్ నివాసాలున్న పట్టణాల సంఖ్య 40 నుంచి 68కి పెరుగుదల

ఈ-కబురు

24 - 08 - 2025
ఆదివారం
e kaburu.com

# 2026 ఏప్రిల్ 1 నుంచి కొత్త ఇన్‌కమ్ ట్యాక్స్ బిల్లు: రాష్ట్రపతి ఆమోదం

**ఆరు దశాబ్దాల నాటి ఆదాయపు పన్ను చట్టం 1961లో మార్పులు చేస్తూ.. కొత్త ఆదాయపు పన్ను బిల్లు 2025ను కేంద్రం ఫిబ్రవరి 13న లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ఈ కొత్త ఇన్‌కమ్ ట్యాక్స్ బిల్లు 2025కు ఈ నెల 12న ఆమోదం లభించింది. బైజయంత్ పాండా నేతృత్వంలోని 31 మంది సభ్యుల సెలెక్ట్ కమిటీ చేసిన అనేక సిఫార్సుల ఆధారంగా ఇందులో మార్పులు చేశారు.**






ఈ కొత్త ఆదాయపన్ను చట్టం, 2025కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు. ఆదాయపన్ను చట్టం, 1961 స్థానంలో కొత్త చట్టం 2026 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానుంది. పాత చట్టంతో పోల్చితే కొత్త చట్టం సరళతరంగా, పారదర్శకంగా ఉంటుందని ఆదాయపన్ను శాఖ 'ఎక్స్' ప్లాట్‌ఫామ్‌పై ప్రకటించింది.

**పాత vs కొత్త బిల్లు మధ్య తేడాలు**

పాత ఆదాయపు పన్ను చట్టం, 1961..దశాబ్దాలుగా అమలులో ఉంది. అయితే అందులోని భాష, నిర్మాణం వంటివన్నీ సామాన్యులకు కొంత గందరగోళంగా ఉన్నాయి. దీనిని పూర్తిగా మార్చాలనే ఉద్దేశ్యంతో కొత్త బిల్లును తీసుకువచ్చారు.

ప్రస్తుత ఆదాయపు పన్ను చట్టం, 1961లో మొత్తం 47 అధ్యాయాలు ఉన్నాయి. కొత్త బిల్లులో.. అధ్యాయాల సంఖ్యను కేవలం 23కి తగ్గించారు. దీనివల్ల చదవడం, అర్థం చేసుకోవడం సులభం అవుతుంది. ఈ మార్పు ముఖ్యంగా పన్ను చెల్లింపుదారులు, నిపుణులకు ఉపశమనం కలిగిస్తుంది.

ఇకపై మునుపటి సంవత్సరం & అసెస్‌మెంట్ సంవత్సరం వంటి పదాలకు బదులు "పన్ను సంవత్సరం" అనే పదం వాడుకలోకి వస్తుంది.

2025 కొత్త పన్ను బిల్లులో ఇంతకు ముందు ఉన్న శ్లాబులు, రేట్లు అలాగే ఉంటాయి. ఐటీఆర్ ఫైలింగ్ గడువు తేదీలు, ఆదాయపన్ను శ్లాబులలో కూడా ఎలాంటి మార్పు లేదు.

కొత్త బిల్లులో, సంక్లిష్టమైన చట్టపరమైన భాషకు బదులుగా, పన్నును సులభంగా లెక్కించగల సూత్రాలు, పట్టికలను ఇవ్వడం జరిగింది. దీనివల్ల పన్ను చెల్లింపుదారులు ఎంత పన్ను చెల్లించాలో..ఎలా చెల్లించాలో అర్థం చేసుకోవడం సులభం అవుతుంది.




## బంగారం విలువపై 90 శాతం లోన్

ప్రైవేటు రంగంలోని సౌత్ ఇండియన్ బ్యాంక్ 'ఎస్ఐబీ గోల్డ్ ఎక్స్‌ప్రెస్' పేరుతో కొత్త బంగారం రుణ పథకాన్ని ప్రారంభించింది. బంగారం విలువపై 90% వరకు రుణాన్ని ఈ పథకం కింద పొందొచ్చు. రూ.25,000 నుంచి రూ.25 లక్షల వరకు రుణం, గరిష్టంగా మూడేళ్ల కాలానికి తీసుకోవచ్చు. ఎంఎస్ఎంఈలు, నాన్ ఎంఎస్ఎంఈలు, చిన్న సంస్థలు తమ వ్యా పార విస్తరణ, మూలధన అవసరాల కోసం రుణాలు తీసుకోవచ్చని సౌత్ ఇండియన్ బ్యాంక్ ప్రకటించింది. ఎలాంటి రహస్య చార్జీల్లేకుండా, పారదర్శకంగా ఈ రుణ పథకం ఉంటుందని తెలిపింది. మొత్తం ప్రక్రియ డిజిటల్‌గా పూర్తవుతుందని, మొదటిసారి రుణం తీసుకునే వారు కూడా అర్హులేనని పేర్కొంది.

# మొన్న ఈడీ.. నేడు సీబీఐ: చిక్కుల్లో అనిల్ అంబానీ

**స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కు రూ. 2,000 కోట్లకు పైగా నష్టం కలిగించిన.. బ్యాంకు మోసం కేసులో రిలయన్స్ కమ్యూనికేషన్స్ , దాని ప్రమోటర్ డైరెక్టర్ 'అనిల్ అంబానీ'కి సంబంధించిన స్థలాలపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ శనివారం దాడులు నిర్వహించింది. ముంబైలోని ఆర్‌కామ్‌తో సహా ఆయనకు సంబంధం ఉన్న ఆరు ప్రదేశాలలో ఈ సోదాలు జరిగాయి.**




బ్యాంకు నిధులు ఎలా దుర్వినియోగం అయ్యాయి?.. రుణాలు మళ్లించబడ్డాయో, లేదో నిర్ధారించడానికి కీలకమైన పత్రాలు, డిజిటల్ ఆధారాలను సేకరించడం కోసం సోదాలు జరుగుతున్నట్లు సమాచారం. ఎస్‌బీఐకి రూ. 2,000 కోట్లకు పైగా నష్టం కలిగించినందుకు ఆర్‌కామ్‌పై కూడా ఏజెన్సీ కేసు నమోదు చేసింది.

అనీల్ అంబానీ, ఆర్‌కామ్ మోసానికి పాల్పడినట్లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జూన్ 13న ప్రకటించింది. జూన్ 24న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కు ఒక నివేదికను పంపింది. ఆర్‌బీఐ మార్గదర్శకాల ప్రకారం.. ఒక బ్యాంకు ఒక ఖాతాను మోసపూరితంగా వర్గీకరించిన తరువాత.. ఆ విషయాన్ని రుణదాత 21 రోజుల్లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు తెలియజేయాలి.

ఆర్‌కామ్‌లో ఎస్‌బీఐ క్రెడిట్ ఎక్స్‌పోజర్‌లో ఆగస్టు 26, 2016 నుంచి అమలులోకి వచ్చే వడ్డీ, ఖర్చులతో పాటు రూ. 786.52 కోట్ల నాన్‌ఫండ్ బేస్డ్ బ్యాంక్ గ్యారెంటీతో పాటు.. రూ. 2,227.64 కోట్ల ఫండ్ బేస్డ్ ప్రిన్సిపల్ బకాయిలు ఉన్నాయని ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి గత నెలలో లోక్‌సభకు తెలిపారు. కాగా ఇప్పటికే అనిల్ అంబానీ కంపెనీలపై ఈడీ (ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్) సోదాలు నిర్వహించింది.





## ఎలాన్ మస్క్ సైబర్‌ట్రక్: సేఫ్టీలో టాప్ రేటింగ్

**అమెరికన్ ఎలక్ట్రిక్ కార్ల దిగ్గజం 'టెస్లా' మార్కెట్లో సైబర్‌ట్రక్ లాంచ్ చేసి చాల రోజులే అవుతోంది. ఇటీవల ఈ కారుకు 'నేషనల్ హైవే ట్రాఫిక్ సేఫ్టీ అడ్మినిస్ట్రేషన్' క్రాష్ టెస్ట్ నిర్వహించింది.**

ఎన్‌హెచ్‌టీఎస్ఏ నిర్వహించిన క్రాష్ టెస్టులో టెస్లా సైబర్‌ట్రక్ 5 స్టార్ రేటింగ్ సొంతం చేసుకుంది. ఇది అన్ని టెస్టులలోనూ మంచి స్కోర్ సాధించి.. మొత్తం మీద సురక్షితమైన కార్ల జాబితాలో ఒకటిగా చేరింది. దీనికి సంబంధించిన వీడియో కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సైబర్‌ట్రక్‌కు టాప్ సేఫ్టీ రేటింగ్ అందుకుంది.. టెస్లా అధినేత ఎలాన్ మస్క్ పేర్కొంటూ ట్వీట్ చేశారు.

ప్రస్తుతం అమెరికన్ మార్కెట్లో టెస్లా సైబర్‌ట్రక్ ధరలు కూడా భారీగా పెరిగాయి. కంపెనీ లాంచ్ చేసినప్పుడు దీని ప్రారంభ ధరను 69,990 అమెరికన్ డాలర్లుగా(రూ.59 లక్షలు) ఉండేది. ఇప్పుడు దీని ధర 15000 డాలర్లు పెరిగినట్లు సమాచారం.

# మైక్రోసాఫ్ట్‌కు పోటీగా మాక్రోహార్డ్?: ఎలాన్ మస్క్ ప్లాన్ ఇదేనా..

**ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ ఎప్పుడూ.. కొత్త విషయాల మీద ఆసక్తి చూపుతుంటారు. ఇప్పుడు తాజాగా మైక్రోసాఫ్ట్ పేరు మాదిరిగా అనిపించే 'మాక్రోహార్డ్' పేరును తన ఎక్స్ ఖాతాలో వెల్లడించారు. దీనికి సంబంధించిన ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.**



ఎక్స్ఏఐ(xAI)లో చేరి.. మాక్రోహార్డ్ అనే పూర్తిగా ఏఐ సాఫ్ట్‌వేర్ కంపెనీని నిర్మించడంలో సహాయం చేయండి. ఇది సాధారణ పేరు, కానీ ఈ ప్రాజెక్ట్ వాస్తవమైనది. మైక్రోసాఫ్ట్ వంటి సాఫ్ట్‌వేర్ కంపెనీలు స్వయంగా ఎటువంటి ఫిజికల్ హార్డ్‌వేర్‌ను తయారు చేయలేదు. కానీ వాటిని పూర్తిగా ఏఐతో సృష్టించడం సాధ్యమవుతుంది'' అని మస్క్ ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు.

ఆగస్టు 1న యునైటెడ్ స్టేట్స్ పేటెంట్ అండ్ ట్రేడ్‌మార్క్ కార్యాలయంలో 'మాక్రోహార్డ్' పేటెంట్ కోసం మస్క్ xAI దాఖలు చేసింది. ఇది పూర్తిగా ఏఐ ద్వారానే పనిచేస్తుంది. ఇందులో కృత్రిమ మేధస్సును ఉపయోగించి వీడియో గేమ్‌లను రూపొందించడం, కోడింగ్, రన్నింగ్, గేమ్స్ కోసం డౌన్‌లోడ్ చేయగల కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ మొదలైనవి ఉన్నాయి.

గత నెలలో Xలో ఒక పోస్ట్‌లో.. ''xAI లేటెస్ట్ AI సాఫ్ట్‌వేర్ కంపెనీ, వందలాది ప్రత్యేక కోడింగ్ మరియు ఇమేజ్ / వీడియో జనరేషన్ /అండర్‌స్టాండింగ్ ఏజెంట్లు అన్నీ కలిసి పనిచేస్తాయి. ఫలితం అద్భుతంగా వచ్చే వరకు వర్చువల్ మెషీన్లలో సాఫ్ట్‌వేర్‌తో పరస్పర చర్య చేసే మానవులను అనుకరిస్తాయి" అని మస్క్ అన్నారు

గత కొన్ని సంవత్సరాలుగా మైక్రోసాఫ్ట్ సంస్థను మస్క్ సందర్భం వచ్చినప్పుడు విమర్శిస్తూనే ఉన్నారు. ఇటీవల మైక్రోసాఫ్ట్ భాగస్వామ్యంగా ఉన్న ఓపెన్‌ఏఐ తాజాగా విడుదల చేసిన చాట్‌జీపీటీ 5 మోడల్ ఎంతో సమర్థంగా పని చేస్తుందని మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. దీనిపై ఎలాన్ మస్క్ స్పందిస్తూ త్వరలో ఓపెన్‌ఏఐ మైక్రోసాఫ్ట్‌ను నాశనం చేస్తుందని చెప్పారు. ఇప్పుడు మైక్రోసాఫ్ట్‌కు పోటీగా మాక్రోహార్డ్ తీసుకొస్తున్నట్లు స్పష్టమవుతోంది.

# భారత్ కీలక నిర్ణయం.. ఆ దేశానికి పోస్టల్ సేవలు బంద్




భారత్ నుంచి అమెరికాకు పోస్టల్ సేవలు నిలిచిపోనున్నాయి. ఈ నెలాఖరులో అమల్లోకి రానున్న అమెరికా కస్టమ్స్ నిబంధనల్లో మార్పులను ఉటంకిస్తూ ఆగస్టు 25 నుంచి అమెరికాకు అన్ని పోస్టల్ సేవలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు తపాలా శాఖ తాజాగా ప్రకటించింది. అనేక వస్తువులపై సుంకం మినహాయింపును అమెరికా ప్రభుత్వం ఉపసంహరించుకున్న నేపథ్యంలో భారత తపాలా శాఖ ఈ నిర్ణయం తీసుకుంది.

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ జూలై 30న జారీ చేసిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ నం.14324 ద్వారా 800 డాలర్ల వరకు విలువైన వస్తువులకు డ్యూటీఫ్రీ మినహాయింపు తొలగించారు. ట్రంప్ ఇటీవల భారత్‌పై 25 శాతం సుంకం విధించడంతో పాటు రష్యా చమురు కొనుగోలుకు అదనంగా 25 శాతం జరిమానా విధించడంతో మొత్తం టారిఫ్ భారం 50 శాతానికి పెరిగింది. ఈ పరిణామాలతో వాణిజ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో ఆ దేశానికి పోస్టల్ సేవలు నిలిపివేసినట్లు తెలుస్తోంది.

ఆగస్టు 29 నుంచి అమెరికాకు తరలించే అన్ని అంతర్జాతీయ పోస్టల్ వస్తువులు వాటి విలువతో సంబంధం లేకుండా, దేశనిర్దిష్ట అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక శక్తి చట్టం (ఐఈఈఈపీఏ) టారిఫ్ ఫ్రేమ్‌వర్క్ ప్రకారం కస్టమ్స్ సుంకాలకు లోబడి ఉంటాయని తపాలా శాఖ ఒక పత్రికా ప్రకటనలో తెలిపింది. అయితే 100 డాలర్ల వరకు విలువైన గిఫ్ట్ ఐటమ్స్ కు మాత్రం మినహాయింపు కొనసాగుతుందని తెలిపింది.

ఎయిర్ క్యారియర్లు తమకు అవసరమైన విధానాలు లేకపోవడంతో ఆగస్టు 25 తర్వాత పార్సిళ్లు తీసుకోలేమని భారత అధికారులకు తెలియజేశారు. దీంతో భారత పోస్టల్ శాఖ ఇప్పుడు లెటర్లు/డాక్యుమెంట్లు, 100 డాలర్ల వరకూ విలువైన గిఫ్ట్ ఐటెమ్స్ మాత్రమే స్వీకరిస్తుంది. ఇప్పటికే బుక్ చేసిన బట్వాడాకు వీలులేని వస్తువులకు రిఫండ్ పొందవచ్చని పోస్టల్ శాఖ తెలియజేసింది.







## ఎన్టీఆర్ డ్యాన్స్ .. అప్పటి సంగతులు గుర్తు చేసుకున్న శ్రీలీల తల్లి

ప్రముఖ నటుడు ఎన్టీఆర్‌పై నటి శ్రీలీల తల్లి, డాక్టర్ స్వర్ణలత ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. శ్రీలీలకు డ్యాన్స్ నేర్పించేందుకు ఎన్టీఆర్ స్ఫూర్తి అని తెలిపారు. జగపతి బాబు హోస్ట్‌గా వ్యవహరిస్తున్న 'జయమ్ము నిశ్చయమ్మురా' టాక్‌షోలో శ్రీలీల, స్వర్ణలత పాల్గొన్నారు. బాల్యంలో ఎన్టీఆర్ కూచిపూడి నృత్య ప్రదర్శనకు సంబంధించిన ఫొటోని డిస్‌ప్లే చేయగా.. స్వర్ణలత నాటి జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారు.
రొమాంటిక్ కామెడీ, లీగల్ డ్రామా వెబ్‌సిరీస్‌లు.. స్ట్రీమింగ్‌కు రెడీ
"నాకు అమ్మాయి పుడితే డ్యాన్స్ నేర్పించాలని నిర్ణయించుకున్న క్షణాల్ని గుర్తుచేసే ఫొటో ఇది" అని తెలిపారు. అప్పుడు ఎన్టీఆర్‌తో మీరు మాట్లాడారా? అని అడగ్గా.. "1997లో లాస్‌ఏంజెలెస్‌లో జరిగిన 'తానా' సభల్లో మాట్లాడా. అనుకున్నట్టే శ్రీలీలకు డ్యాన్స్ నేర్పించా" అని స్వర్ణలత తెలిపారు. తాను తెలుగు, కన్నడ, హిందీ, ఇంగ్లిష్‌లో మాట్లాడగలనని, కొత్త భాష నేర్చుకోవడం ఎప్పుడూ ఆసక్తే అని శ్రీలీల ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. 'కెరీర్‌లో దూసుకెళుతున్నావ్. వేరే హీరోయిన్ల అవకాశాలు కూడా తీసుకుంటున్నావ్' అని జగపతి బాబు సరదాగా అన్నారు. ఈ ఎపిసోడ్ ఓటీటీ 'జీ 5'లో స్ట్రీమింగ్ అవుతోంది. తొలి ఎపిసోడ్‌లో ప్రముఖ నటుడు నాగార్జున సందడి చేసిన సంగతి తెలిసిందే.

ఇటీవల 'జూనియర్' మూవీతో ప్రేక్షకులను పలకరించిన శ్రీలీల.. 'మాస్ జాతర', 'పరాశక్తి' 'ఉస్తాద్ భగత్‌సింగ్' తదితర చిత్రాల్లో నటిస్తున్నారు. ఎన్టీఆర్ కూచిపూడి నృత్యంలో శిక్షణ పొందిన సంగతి తెలిసిందే. 12 ఏళ్ల సాధనలో వందకిపైగా ప్రదర్శనలిచ్చారు.



## ఆ సీన్ కోసం 28 టేకులు.. ఆ విషయం ఎప్పుడు గుర్తొచ్చినా..

**'పరిణీత' చిత్రంతో విద్యాబాలన్ కెరీర్ మొదలైంది. ఈ సినిమా 2005 జూన్ 10న విడుదలైంది. శరత్ చంద్ర చటోపాధ్యాయ రాసిన పరిణీత (1914) అనే బెంగాలీ నవల ఆధారంగా ఈ మూవీ తెరకెక్కింది. సంజయ్ దత్, సైఫ్ అలీ ఖాన్ ప్రధాన పాత్రలు పోషించారు. ప్రదీప్ సర్కార్ డైరెక్ట్ చేసిన ఈ మూవీ 20 ఏళ్ల తర్వాత రీరిలీజ్ అవుతోంది. ఆగస్టు 29న మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది.**

**ఇంత పరిచయమా? నాకు తెలీదు**
ఈ సందర్భంగా విద్యాబాలన్ ఆనాటి సంగతులను గుర్తు చేసుకుంది. నాకు బాగా గుర్తు.. సైఫ్ అలీ ఖాన్ తల్లి, బాలీవుడ్ స్టార్ షర్మిల ఠాగూర్ ఓరోజు సెట్‌కు వచ్చింది. తనను చూసేందుకు నేను చాలా ఎగ్జయిట్ అయ్యాను. ఆవిడంటే నాకెంతో ఇష్టం. మామధ్య ఎంతో అనుబంధం ఉందన్నట్లుగా ఒకరినొకరం పలకరించుకున్నాం. అది చూసిన సైఫ్.. ఓహ్, మీ ఇద్దరికీ ఇంత పరిచయముందని నాకింతవరకు తెలీదు అని సరదాగా జోక్ చేశాడు.

**ఎప్పుడు గుర్తు చేసుకున్నా..**
వెంటనే నేను నాకు ఆమె తెలుసు.. కానీ తనకు నేను తెలియదని బదులిచ్చాను. సైఫ్ సరదాగా ఉంటూ ఎప్పుడూ నవ్విస్తుంటాడు. ఆ సంఘటన ఇప్పుడు గుర్తు చేసుకున్నా నవ్వొస్తుంటుంది. దాదా (ప్రదీప్ సర్కార్) వల్లే నటనలో మెళకువలు నేర్చుకున్నాను. ప్రతి చిన్నవిషయాన్ని కూడా గుర్తించి సీన్ మళ్లీ చేయిస్తాడు. అవసరమైతే వంద టేకులైనా తీసుకుంటాడు.

**కన్నీటి చుక్క సరిగ్గా రావాలని..**
కేవలం మా పర్ఫామెన్స్ కోసమే కాదు, వెనకాల పావురాలు ఎగిరే క్షణాలు కూడా సరిగ్గా రావాలనుకుంటాడు. అన్నీ సరిగ్గా కుదరాలని భావిస్తాడు. ఒక పాటలో నేను ఏడవాల్సి ఉంటుంది. ఆ పాటలోని ఓ లైన్ దగ్గర నా కన్నీటిచుక్క కిందపడాలి. దీని కోసం 28 టేకులు తీసుకున్నాను అని చెప్పుకొచ్చింది. ప్రదీప్ సర్కార్.. అనారోగ్యంతో 2023లో కన్నుమూశారు.

## స్ట్రాంగ్‌గా ఉండే అమ్మాయిలను చూసి ఓర్వలేరు.. అందాలు భద్రపరిచా

గతంలో రెండు బ్రేకప్స్ జరిగాయంటోంది బాలీవుడ్ హీరోయిన్ డైసీ షా . అందులో తనను బాగా ఇబ్బంది పెట్టిన రిలేషన్‌షిప్ గురించి తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడింది. ఓ అబ్బాయితో చాలా ఏళ్లు రిలేషన్‌లో ఉన్నాను. మొదటి నాలుగేళ్ల సమయంలో అసలు పెళ్లి ఆలోచనే రాలేదు. తర్వాత నాకు ఆ ఆలోచనే రాకుండా చేశాడు. ఏడో సంవత్సరంలో ఉండగా.. నేను సంతోషంగా లేనన్న విషయాన్ని గ్రహించి బ్రేకప్ చెప్పాను.

రెండో రిలేషన్‌లో పరిస్థితి మరీ దారుణం. నేనెక్కడికి వెళ్తున్నా?.. అబ్బాయిలతో కలిసి పని చేస్తున్నానా? ఇలా ప్రతీది గుచ్చిగుచ్చి అడిగేవాడు. ఇక్కడ ఆశ్చర్యకర విషయమేంటంటే.. అతడు కూడా ఇదే ఇండస్ట్రీలో ఉన్నాడు. ఒకసారి మేమిద్దరం పార్టీలో ఉన్నాం. ఫ్రెండ్స్‌తో కలిసి డ్యాన్స్ చేస్తున్నాం. ఇంతలో ఒకరు నా వెనక నుంచి వచ్చి చేయి పట్టుకుని లాగి తనతో డ్యాన్స్ చేయమని అడిగాడు.

**నా తప్పేముంది?**
అందులో తప్పేముంది? దానికి నాపై కోప్పడాల్సిన అవసరం లేదుకదా! కానీ అతడు మాత్రం వేరే అమ్మాయిలతో డ్యాన్స్ చేస్తూ తనను అర్థం చేసుకోమన్నాడు. అతడి పద్ధతి నాకు చిరాకు తెప్పించేది. నన్నెప్పుడూ కంట్రోల్ చేయాలని చూసేవాడు. దానివల్ల మరింత ఫ్రస్టేట్ అయ్యేదాన్ని. బలమైన అమ్మాయిలను చూసి మగవాళ్లు అస్సలు ఓర్వలేరు. అలాంటివాళ్లను చాలామందిని చూశాను. ఇప్పట్లో అయితే పెళ్లి చేసుకోవాలన్న ఆసక్తి లేదు. పైగా నేను ఆర్థికంగా బాగానే ఉన్నాను. నా పోషణ కోసం ఒక మగవాడి తోడు అవసరం లేదు. అయితే నా స్నేహితురాలి సలహాతో అండాలు భద్రపరిచాను అని చెప్పుకొచ్చింది.

**కెరీర్**
డైసీ షా.. ప్రముఖ కొరియోగ్రాఫర్ గణేశ్ ఆచార్యకు అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌గా కెరీర్ మొదలుపెట్టింది. భద్ర అనే కన్నడ చిత్రంతో హీరోయిన్‌గా మారింది. సల్మాన్ ఖాన్‌తో చేసిన 'జై హో' మూవీతో మంచి గుర్తింపు అందుకుంది. ఈమె చివరగా మిస్టరీ ఆఫ్ ద టాటూ మూవీ చేసింది. గతేడాది వచ్చిన రెడ్ రూమ్ అనే వెబ్ సిరీస్‌లో కనిపించింది. మరో రెండు రోజుల్లో (ఆగస్టు 25న) డైసీ షా 41వ వయసులోకి అడుగుపెట్టనుంది.



## నేనే గనుక నిర్మాతనైతే ఆ సినిమా ఎప్పుడో రిలీజ్ అయ్యేది: ఆండ్రియా

ఆండ్రియా అంటే నటి మాత్రమే కాదు.. అంతకు మించి. గాయని, రచయిత్రి.. వీటన్నింటికీ మించి బోల్డ్ నటి. ఏ తరహా పాత్రనైనా చేయడానికి వెనుకాడని డేరింగ్ బ్యూటీ అంటూ కోలీవుడ్‌లో గుర్తింపు ఉంది. ఈమె పలు భాషల్లో నటిస్తూ తనకంటూ ప్రత్యేక ఇమేజ్‌ను సంపాదించుకున్న ఆండ్రియా మోస్ట్ ఎలిజబుల్ బ్యాచిలర్ భామ అన్నది గమనార్హం. ఈమె 2014లో నటించిన పిశాచు చిత్రం విడుదలై మంచి విజయాన్ని సాధించింది. దీంతో ఆ చిత్రానికి సీక్వెల్‌కు దర్శకుడు మిష్కిన్ దర్శకత్వం వహిస్తున్నారు. నటుడు విజయ్‌సేతుపతి క్యామియో పాత్రను పోషించిన ఈ చిత్రంలో నటి పూర్ణ, సంతోష్ ప్రతాప్, నమితా కృష్ణమూర్తి, అజ్మల్ తదితరులు ముఖ్యపాత్రలు పోషించారు.

రాక్‌పోర్ట్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై మురుగానందం నిర్మించిన ఈ చిత్రం చాలా కాలం క్రితమే నిర్మాణ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. ఎప్పుడో విడుదల కావాల్సిన ఈ చిత్రం కొన్ని సమస్యల కారణంగా విడుదలలో ఆలస్యం జరుగుతోంది. పైగా పిశాచు–2 చిత్రంలో ఆండ్రియా నటన అదుర్స్ అంటూ దర్శకుడు మిష్కిన్ ప్రచారం చేశారు. అయితే గత మూడేళ్లుగా ఈ చిత్రం విడుదలకు నోచుకోలేదు. కాగా ఈ చిత్రం విడుదల గురించి ఇటీవల ఒక కార్యక్రమంలో పాల్గొన్న నటి ఆండ్రియాను అడగ్గా తాను నటించడం మాత్రమే చేయగలను కానీ చిత్రాన్ని రిలీజ్ చేయగలనా? అని ప్రశ్నించారు.

అలాగే తానే నిర్మాతనైనే పిశాచు చిత్రాన్ని ఎప్పుడో విడుదల చేసేదాన్ని అని పేర్కొన్నారు. ఇప్పుడు ఈ వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. కాగా నటి ఆండ్రియా నటించిన మనుషీ చిత్రం కూడా వివాదాల్లో చిక్కుంది. ప్రస్తుతం ఈ భామ నో ఎంట్రీ, మాస్క్ చిత్రాల్లో నటిస్తున్నారు.

పిశాచు–2 ఆలశ్యానికి కారణం ఏంటి
ఫ్లయింగ్ హార్స్ పిక్చర్స్ అనే సంస్థ 'పిశాచి–2' విడుదలను అడ్డుకుంది. సినిమా హక్కుల విషయంలో కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ చిత్ర నిర్మాణ సంస్థ రాక్‌ఫోర్ట్ బ్యానర్ వారు తమకు రూ. 4.85 కోట్లు చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. చట్టపరమైన వివాదాలతో పాటు ఈ సినిమాలో ఆండ్రియా నగ్నంగా నటించినట్లు దర్శకుడు మిష్కిన్ వెల్లడించారు. అయితే, ఈ సన్నివేశాలను పూర్తిగా చిత్రీకరించలేదని, ఫొటోలు మాత్రమే తీసినట్లు చెప్పారు. ఈ అంశం కూడా సినిమాపై వివాదాన్ని పెంచింది.



## రిలీజ్ డేట్ ఫిక్స్.. 'బ్యూటీ' టీజర్ విడుదల

మంచి యూత్ ఫుల్ లవ్ స్టోరీకి, ఫాదర్ ఎమోషన్, మిడిల్ క్లాస్ టచ్ ఇస్తూ తీసిన సినిమా 'బ్యూటీ'. అంకిత్ కొయ్య, నీలఖి జంటగా నటించారు. జె.ఎస్.ఎస్.వర్ధన్.. మాటలు, దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని అడిదాల విజయపాల్ రెడ్డి, ఉమేష్ కుమార్ బన్సాల్ నిర్మించారు. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన పోస్టర్లు, గ్లింప్స్, పాటలు వచ్చాయి.తాజాగా ఈ మూవీ టీజర్‌ను విడుదల చేశారు. 'కూతురు అడిగింది కొనిచ్చేప్పుడు వచ్చే కిక్కు ఓ మధ్య తరగతి తండ్రికే తెలుస్తుంది.. తన కోసం కొంచెం కష్టపడాలి.. పడతాను' అనే ఎమోషనల్ డైలాగ్ ఈ మూవీ కథ ఏంటో చెప్పకనే చెప్పేస్తుంది. టీజర్‌లో విజయ్ బుల్గానిన్ సంగీతం అలరిస్తోంది. ఆయ్, మారుతీ నగర్ సుబ్రహ్మణ్యం తదితర చిత్రాలతో ఆకట్టుకున్న అంకిత్.. 'బ్యూటీ' చిత్రంతో ఇప్పుడు ప్రేక్షకుల ముందుకొస్తున్నాడు. సెప్టెంబర్ 19న ఈ మూవీని గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతోన్నారు.





## బౌలింగ్ కోసం ఆ మూడింటినీ బుమ్రా వదిలేశాడు: భరత్ అరుణ్

**జస్‌ప్రీత్ బుమ్రా పేరు చెప్పగానే మనకు అతడి యూనిక్ యాక్షన్, సర్రున దూసుకొచ్చే బంతులే గుర్తుకు వస్తాయి. అయితే దీని కోసం బుమ్రా ఎంతో కష్టపడ్డాడు. ఎన్నో త్యాగాలు చేశాడు. బౌలింగ్‌లో మరింత వేగం కోసం తనకిష్టమైన మూడు ఆహారాలనూ వదిలేశాడు. ఈ విషయాన్ని టీమ్‌ఇండియా మాజీ బౌలింగ్ కోచ్ భరత్ అరుణ్ తెలిపాడు. అలాగే బుమ్రా బౌలింగ్ యాక్షన్ వల్ల అతడి శరీరం చాలా ఒత్తిడికి గురైంది. దీంతో అతడి కోసం ప్రత్యేక ప్లాన్‌ను సిద్ధం చేశానని అప్పటి రోజులను భరత్ గుర్తుకు తెచ్చుకున్నాడు.**

'ఫిట్‌నెస్ అనగానే మనకు విరాట్ కోహ్లీ గుర్తుకు వస్తాడు. కానీ ఈ విషయంలో జస్‌ప్రీత్ బుమ్రా కూడా ఏం తక్కువ కాదు. 2013లో బుమ్రా అండర్19 క్యాంప్‌లో భాగంగా సెలెక్షన్ కోసం ఎన్‌సీఏకు వచ్చాడు. అతడు తుది జట్టులో లేడు. కానీ నేషనల్ క్రికెట్ అకాడమీ క్యాంప్‌నకు వచ్చిన 30 మంది సభ్యుల్లో ఉన్నాడు' అని భరత్ ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించాడు.

'అప్పట్లో బుమ్రా మరీ వేగంగా బంతులేయలేక పోయాడు. దీంతో మేం ఫిజియో, స్ట్రెంత్ అండ్ కండీషనింగ్ కోచ్‌తో మాట్లాడాం. మేమంతా అతడి యాక్షన్ జోలికి వెళ్లకూడదనుకున్నాం. ఎందుకంటే అది యూనిక్ యాక్షన్. దాంతో చాలా పేస్ జనరేట్ చేయొచ్చని మాకు అనిపించింది. కానీ అదే సమయంలో ఆ యాక్షన్ వల్ల అతడి శరీరం మీద తీవ్రమైన ఒత్తిడి పడుతుందని గుర్తించాం' అని భరత్ పేర్కొన్నాడు.

ఆ సమయంలో బుమ్రాతో తాము మాట్లాడిన విషయాన్ని వెల్లడించాడు. 'మేం బుమ్రాను పిలిచి అతడితో మాట్లాడాం. ఫాస్ట్ బౌలర్‌గా రాణించాలంటే ఫిజికల్‌గా కూడా ఫిట్‌గా ఉండాలని అతడికి సూచించాం. డైట్, వ్యాయామం, చేయాల్సిన త్యాగాల గురించి వివరించాం. బుమ్రా కూడా వెంటనే తనను తాను మార్చుకున్నాడు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం ప్రారంభించాడు. జిమ్‌లో వర్క్ అవుట్లు మొదలు పెట్టాడు. అచ్చం విరాట్ కోహ్లీలానే ఫిట్‌నెస్ కోసం అంకితభావంతో కృషి చేశాడు. బుమ్రాకు బర్గర్లు, పిజ్జాలు, మిల్క్‌షేక్స్ అంటే చాలా ఇష్టం. కానీ వాటిని మరుక్షణమే వదిలేశాడు. రుచికరమైన ఆహారం కంటే.. తనకు బౌలింగే ఇష్టం అని చాటి చెప్పాడు' అని భరత్ అరుణ్ గుర్తుచేసుకున్నాడు.

టీమ్‌ఇండియా ఇటీవలే ఇంగ్లాండ్‌లో పర్యటించింది. అందులో భాగంగా అయిదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ ఆడింది. అయితే వర్క్‌లోడ్ నేపథ్యంలో బుమ్రా ఈ సిరీస్‌లో కేవలం మూడు మ్యాచ్‌లే ఆడాడు. వీటిలో 14 వికెట్లు పడగొట్టాడు. సెప్టెంబర్ 9 నుంచి యూఏఈ వేదికగా ఆసియా కప్ జరగనుంది. ఈ నేపథ్యంలో ప్రకటించిన భారత జట్టులో కూడా బుమ్రా స్థానం సంపాదించాడు.

## శుభ్‌మన్ గిల్‌కు వైరల్ ఫీవర్.. దులీప్ ట్రోఫీకి దూరం!




ఐదు రోజుల్లో దులీప్ ట్రోఫీ.. ఆపై పది రోజులకే ఆసియా కప్ మొదలవుతుంది. మొన్నటివరకూ ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌లో దుమ్మురేపిన శుభ్‌మన్ గిల్ టీ20 జట్టుకు వైస్ కెప్టెన్‌గా మారాడు. ఇంతలోనే అభిమానులకు బ్యాడ్ న్యూస్. దులీప్ ట్రోఫీకి దూరమైనట్లు తెలుస్తోంది. అలాగే ఆసియా కప్ బరిలోకి దిగడం పైనా అనుమానాలు వస్తున్నాయి. తాజాగా గిల్ వైరల్ ఫీవర్ బారిన పడినట్లు కథనాలు వస్తున్నాయి. ఇప్పటికే రక్త నమూనాలను బ్లడ్ టెస్టుకు పంపినట్లు సమాచారం. ఆ రిపోర్ట్ బీసీసీఐ వద్దకు చేరిందని.. దీంతో దులీప్ ట్రోఫీ నుంచి అతడికి మినహాయింపు దక్కిందని క్రికెట్ వర్గాలు తెలిపాయి. నార్త్ జోన్ జట్టు సారథిగా తొలుత గిల్‌ను ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అతడికి బదులు వైస్ కెప్టెన్‌గా ఉన్న అంకిత్ కుమార్ జట్టును నడిపించే అవకాశాలు ఉన్నాయి.

**మరి ఆ టోర్నీ సంగతి?**

ఆసియా కప్ కోసం ఇప్పటికే భారత స్క్వాడ్‌ను ప్రకటించింది. సూర్యకుమార్ యాదవ్ నాయకత్వంలో టీమ్‌ఇండియా బరిలోకి దిగనుంది. గిల్‌ను వైస్ కెప్టెన్‌ను చేసింది. ఆసియా కప్ కోసం భారత్ సెప్టెంబర్ ఆరంభంలోనే యూఏఈకి పయనం కానుంది. సెప్టెంబర్ 5న తొలి ట్రైనింగ్ సెషన్ జరగనుంది. ఆలోగా గిల్ పూర్తిగా కోలుకుంటే ఎలాంటి అవాంతరం లేకుండా దుబాయ్ చేరుకుంటాడు. ఎలాగూ దులీప్ ట్రోఫీలో అతడు ఆడటం లేదు. ఆసియా కప్‌లో భారత్ తొలి మ్యాచ్‌ను సెప్టెంబర్ 10న యూఏఈతో ఆడాల్సిఉంది. దీంతో ఫిట్‌నెస్‌ను అందుకోవడానికి గిల్‌కు ఇంకా చాలా సమయం ఉంది. కాబట్టి, ఆసియా కప్ నుంచి గిల్ వైదొలగడం దాదాపు అసాధ్యమే. అయితే, వైరల్ ఫీవర్ టెస్టు ఫలితాలను బట్టి బీసీసీఐ నిర్ణయం తీసుకొనే అవకాశం లేకపోలేదు.

## ఆసియా కప్ కోసం భారత్‌కు రావడం లేదు: పాక్ హాకీ దిగ్గజం



**న్యూఢిల్లీ:** భారత్ ఆతిథ్యమిచ్చే ఆసియా కప్ హాకీ టోర్నమెంట్‌కు ఇదివరకే పాకిస్తాన్ జట్టు దూరంగా ఉంది. ఇప్పుడు ఆ దేశ దిగ్గజం సొహైల్ అబ్బాస్ కూడా మలేసియా జట్టు అసిస్టెంట్ కోచ్ హోదాలో భారత్‌కు వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదు.ఈ మేరకు ఈ నెల 29 నుంచి సెప్టెంబర్ 7 వరకు జరిగే టోర్నీకి అందుబాటులో ఉండటం లేదని ప్రకటించాడు. పాక్ దిగ్గజ డ్రాగ్‌ఫ్లికర్‌గా ఖ్యాతి గడించిన అతను ప్రస్తుతం మలేసియా హాకీ జట్టుకు సేవలందిస్తున్నారు. ఈ జట్టు ఆసియా కప్ కోసం భారత్‌కు రానుంది. ఈ టోర్నీ విజేత నేరుగా ప్రపంచకప్ టోర్నీకి అర్హత సాధిస్తుంది. ఇంతటి ప్రాధాన్యత ఉన్న ఆసియా ఈవెంట్‌కు మలేసియా జట్టు తరఫున వచ్చేందుకు అనాసక్తి చూపడం విడ్డూరంగా ఉంది. అయితే తన నిర్ణయానికి స్వదేశం (పాక్) తీసుకున్నగైర్హాజరుకు సంబంధం లేదని అబ్బాస్ చెప్పుకొచ్చాడు.'నేను ఆసియా కప్ కోసం భారత్‌కు వెళ్లడం లేదు. వ్యక్తిగత కారణాల వల్లే ఆ ఈవెంట్‌కు అందుబాటులో ఉండటం లేదు. ఇది నా సొంత నిర్ణయం. దీనిపై ఎవరి ప్రభావం లేదు' అని అన్నాడు. అబ్బాస్ 2012లో అంతర్జాతీయ హాకీకి గుడ్‌బై చెప్పారు.

ఆ తర్వాత 2024 వరకు లోప్రొఫైల్ జీవితాన్నే గడిపారు. గతేడాది మలేసియా కోచింగ్ బృందంలో చేరారు. 48 ఏళ్ల సొహైల్ అబ్బాస్ ఏకంగా నాలుగు ప్రపంచకప్‌లు (1998, 2002, 2006, 2010), మూడు ఒలింపిక్స్ (2000, 2004, 2012)లలో పాల్గొన్నారు. 1998, ఫిబ్రవరిలో భారత్‌తో పెషావర్‌లో జరిగిన మ్యాచ్‌తో అరంగేట్రం చేసిన అబ్బాస్ 311 మ్యాచ్‌లు ఆడి 21 సార్లు హ్యాట్రిక్ గోల్స్ నమోదు చేశాడు. భారత్‌లో 20 ఏళ్ల క్రితం జరిగిన ఇండియన్ ప్రీమియర్ హాకీ లీగ్‌లో విజేత హైదరాబాద్ సుల్తాన్స్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాడు.

## లార్డ్స్‌లో చెమటోడ్చిన విరాట్ కోహ్లీ




**టీమ్‌ఇండియా ఆస్ట్రేలియాతో మూడు వన్డేలు ఆడనుంది. ఈ సిరీస్ అక్టోబర్ 19 నుంచి జరగనుంది. ఈ నేపథ్యంలో భారత జట్టు తరఫున వన్డేల్లో పునరాగమనం కోసం టీమ్‌ఇండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ తీవ్రంగా ప్రాక్టీస్ చేస్తున్నాడు. ఇందులో భాగంగా లార్డ్స్ లోని ఇండోర్ నెట్స్‌లో అతడు దాదాపు రెండు గంటలపాటు బ్యాటింగ్‌లో సాధన చేశాడు. ఈ క్రమంలో అతడు స్పిన్, ఫాస్ట్ బౌలింగ్‌ను ఎదుర్కొన్నాడు.**

రోహిత్ శర్మ , విరాట్ కోహ్లీ ఇంతకు ముందే టీ20 ఫార్మాట్‌కు వీడ్కోలు పలికారు. అలాగే వీరిద్దరూ ఇటీవలే టెస్ట్ క్రికెట్‌కూ తమ రిటైర్మెంట్ ప్రకటించారు. ప్రస్తుతం రోకో ద్వయం కేవలం వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్నారు. 2027 వన్డే ప్రపంచ కప్ వరకు వీరిద్దరూ టీమ్‌లో కొనసాగాలని అభిమానులు కోరుకుంటున్నారు. అయితే దీనిపై ప్రస్తుతానికి అనిశ్చితి నెలకొంది. ఆస్ట్రేలియాతో వన్డే మ్యాచ్‌ల తర్వాత రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ రిటైర్మెంట్ ప్రకటిస్తారని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే వీటిని తాజాగా.. బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా ఖండించాడు.

ఓ కార్యక్రమంలో పాల్గొన్న శుక్లాను.. సచిన్ తెందూల్కర్‌లా రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీకి ప్రత్యేకంగా ఫేర్‌వెల్ నిర్వహిస్తారా.. అని హోస్ట్ ప్రశ్నించాడు. దీనిపై అతడు కాస్త తీవ్రంగానే స్పందించాడు. 'వారు ఎప్పుడు రిటైర్ అవుతున్నారు? రోహిత్, విరాట్ ఇప్పటికీ వన్డేల్లో ఉన్నారు. ఇంకా ఆడుతున్నారు కదా! అప్పుడే ఫేర్‌వెల్ గురించి మాట్లాడటం ఎందుకు? విరాట్ ఇంకా ఫిట్‌గా ఉన్నాడు. రోహిత్ శర్మ అద్భుతంగా పరుగులు రాబడుతున్నాడు..' అని రాజీవ్ శుక్లా సమాధానం చెప్పాడు.

ఇప్పటి వరకు 302 వన్డేల్లో టీమ్‌ఇండియాకు ప్రాతినిధ్యం వహించిన కోహ్లీ.. 14,181 పరుగులు చేశాడు. ఇందులో 51 శతకాలు, 74 అర్ధశతకాలున్నాయి. 183 రన్స్ అతడికి వన్డేల్లో అత్యధిక స్కోర్. అలాగే 123 టెస్ట్ మ్యాచ్‌ల్లో అతడు 9,230 రన్స్ చేశాడు. ఇందులో 30 సెంచరీలు, 31 హాఫ్ సెంచరీలున్నాయి. 254*.. టెస్టుల్లో అతడి అత్యధిక స్కోర్. 125 టీ20 మ్యాచ్‌ల్లో కోహ్లీ 4,188 రన్స్ సాధించాడు. ఇందులో ఒక శతకం, 38 అర్ధ శతకాలున్నాయి. 122* అతడి వ్యక్తిగత అత్యధిక స్కోర్.

## నా టీమ్‌లో శ్రేయస్ అయ్యరే కెప్టెన్: టీమ్ ఇండియా మాజీ క్రికెటర్

**ప్రతిష్ఠాత్మక ఆసియా కప్ సెప్టెంబర్ 9 నుంచి ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ఆగస్టు 19న 15 మంది సభ్యులతో కూడిన భారత జట్టును ప్రకటించారు. కానీ అందులో శ్రేయస్ అయ్యర్‌కు చోటు దక్కలేదు. అయితే టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా తన యూట్యూబ్ ఛానల్ వేదికగా ఆసియా కప్‌నకు తన సొంత టీమ్‌ను ప్రకటించాడు. అందులో శ్రేయస్ అయ్యర్‌కు చోటు కల్పించడమే కాకుండా.. అతడికే కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించాడు.**




'యశస్వి జైస్వాల్‌కు కచ్చితంగా ఆసియా కప్‌లో స్థానం కల్పించాల్సిందే. ఎందుకంటే అతడు టీ20 వరల్డ్ కప్ స్క్వాడ్‌లో భాగమైతేనే బాగుంటుంది. అక్కడ స్థానం కల్పించి, ఆసియా కప్‌లో జట్టు నుంచి దూరంగా పెట్టడం సరికాదు. అలాగే నేను రుతురాజ్ గైక్వాడ్‌ను స్క్వాడ్‌లోకి తీసుకుంటా. అతడికి వైస్ కెప్టెన్సీ కూడా ఇస్తా. అతడు గుహవటి వేదికగా జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా మీద సెంచరీ సాధించాడు. అతడి ఆటలో నిలకడ ఉంది. వీరిద్దరూ ఓపెనర్లుగా వస్తారు' అని ఆకాశ్ చోప్రా వెల్లడించాడు.

అలాగే తర్వాతి స్థానాల్లో తాను ఎవరికి స్థానం కల్పిస్తాడో కూడా వివరించాడు. 'మూడో స్థానంలో కేఎల్ రాహుల్ఆడతాడు. అతడు అవసరమైతే ఓపెనింగ్ చేయగలడు. డౌన్ ది ఆర్డర్ కూడా ఆడగలడు. అలాగే వికెట్ కీపింగ్ కూడా చేయగలడు. శ్రేయస్ అయ్యర్‌కు నాలుగో స్థానం కల్పిస్తాను. ఇంకా కెప్టెన్సీ కూడా అతడికే. అలాగే అయిదో స్థానంలో రిషభ్ పంత్ ఉంటాడు. ఇక ఆరో స్థానంలో నితీశ్ కుమార్ రెడ్డిని ఆడిస్తాను. అతడు హార్దిక్ పాండ్యకు ప్రత్యామ్నాయం. ఇంకా ఏడు, ఎనిమిదో స్థానాల్లో కృనాల్ పాండ్య, వాషింగ్టన్ సుందర్ బ్యాటింగ్‌కు వస్తారు. ఐపీఎల్‌లో ప్రదర్శన ఆధారంగా కృనాల్ పాండ్యకు జట్టులో స్థానం ఉండాల్సిందే. ఇక వాషింగ్టన్ సుందర్ వల్ల బ్యాటింగ్‌లో డెప్త్ పెరుగుతుంది' అని ఆకాశ్ చోప్రా వివరించాడు.

బౌలర్ల విషయంలోనూ అతడు తన ఎంపిక గురించి తెలిపాడు. 'తొమ్మిదో స్థానంలో రవి బిష్ణోయ్ ఆడతాడు. పది, పదకొండో స్థానాల్లో ప్రసిద్ధ్ కృష్ణ, మహ్మద్ సిరాజ్ఆడతారు. సాయి సుదర్శన్, ధ్రువ్ జురేల్, రియాన్ పరాగ్, యజ్వేంద్ర చాహల్, ఖలీల్ అహ్మద్ తదితరులు రిజర్వ్‌లో ఉంటారు' అని ఆకాశ్ చోప్రా తన జట్టును ప్రకటించాడు. అయితే అతడు తన టీమ్‌లో సూర్యకుమార్ యాదవ్ , శుభ్‌మన్ గిల్‌కు స్థానం కల్పించకపోవడం గమనార్హం.




## 'కూత' మారుతోంది

**కొత్తగా టైబ్రేకర్ షూటౌట్**
**29 నుంచి ప్రో కబడ్డీ లీగ్**

**ముంబై: ప్రో కబడ్డీ లీగ్ (పీకేఎల్) ఫార్మాట్ మారినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 29 నుంచి జరిగే 12వ సీజన్ పీకేఎల్‌ను మారిన ఫార్మాట్ ప్రకారం నిర్వహిస్తారు. మ్యాచ్‌ల్లో రసవత్తర పోటీ పెరిగేందుకు అభిమానులకు ఉత్కంఠభరితమైన అనుభూతిని పంచేందుకు ఈ మార్పులు దోహదం చేస్తాయని నిర్వాహకులు చెబుతున్నారు. కొత్తగా టైబ్రేకర్, గోల్డెన్ రెయిడ్ నిబంధనలను తీసుకొచ్చారు. గతంలో గోల్డెన్ రెయిడ్ కేవలం ప్లేఆఫ్స్‌లోనే ఉండేది. ఇప్పుడు లీగ్ ఆసాంతం కొనసాగిస్తారు. మ్యాచ్ 'టై' అయితే కొత్త టైబ్రేకర్‌తో ఫలితం కచ్చితంగా ఫలితం రానుంది.**

స్కోరు సమమైన పక్షంలో ఒక్కో జట్టుకు ఫుట్‌బాల్ తరహాలో 5 రెయిడ్ షూటౌట్ అవకాశాలిస్తారు. ఇరు జట్లు ఏడుగురు చొప్పున ఆటగాళ్లను నామినేట్ చేస్తాయి. ఇందులో ఐదుగురు రెయిడ్ చేస్తారు. 'షూటౌట్' స్కోరు సమమైతే అప్పుడు గోల్డెన్ రెయిడ్ తెరపైకి వస్తుంది. ఇలాంటి మార్పులతో మ్యాచ్‌లో మరింత నాటకీయత పెరుగుతుందని, ఆటలోనూ పోటీ కూడా అభిమానుల్ని ఆకర్శిస్తుందని పీకేఎల్ నిర్వాహకులు భావిస్తున్నారు. ఈ సీజన్‌లో లీగ్ దశలో 108 మ్యాచ్‌లుంటాయి. ఒక్కో ఫ్రాంచైజీ జట్టు 18 మ్యాచ్‌లు ఆడుతుంది. పాత పద్ధతిలో ప్లే ఆఫ్స్ ఉంటాయి... కానీ ఇకపై పాయింట్ల పట్టికలో మొదటి 8 స్థానాల్లో నిలిచిన జట్లు ప్లేఆఫ్స్ చేరతాయి. తద్వారా టైటిల్ రేసులో 8 జట్లు పోటీలోనే ఉంటాయి. 5 నుంచి 8వ స్థానంలో నిలిచిన ఫ్రాంచైజీలు 'ప్లే-ఇన్' మ్యాచ్‌లు ఆడతాయి. గెలిచిన జట్లు ముందంజ వేస్తాయి. అలాగే 3, 4 స్థానాల జట్లు 'మినీ క్వాలిఫయర్' ఆడతాయి. ఇక్కడ గెలిచిన జట్టు ముందుకెళుతుంది. కానీ ఓడిన జట్టు నిష్క్రమించదు. ఓడిన జట్టుకు ప్లే ఆఫ్స్ చేరేందుకు మరో అవకాశముంటుంది. ఈ ప్రక్రియలో మొత్తం మూడు ఎలిమినేటర్ మ్యాచ్‌లు జరుగుతాయి. ఇక మొదటి రెండు స్థానాల్లో ఉన్న జట్లు క్వాలిఫయర్-1 ఆడతాయి. విజేత జట్టు నేరుగా ఫైనల్‌కు చేరుతుంది. ఓడిన జట్టు క్వాలిఫయర్-2 ఆడుతుంది. ఎలిమినేటర్ ఫలితాల విజేత క్వాలిఫయర్-2కు అర్హత సాధిస్తుంది. అంటే 3 నుంచి 8వ స్థానం వరకు నిలిచే ఏ జట్టయిన ఇకపై ఫైనల్‌కు చేరే అవకాశంఉందన్న మాట!